J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 27.11.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 26 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com

## నెల్లూరుని నీట ముంచిన..
# 'నివర్'
## తమిళనాట తీరం దాటిన వాయుగుండం
## జిల్లాకు తప్పిన పెనుగండం


నీళ్ళలో పర్యటించిన నీళ్ళ మంత్రి


నగరం నీటి మయం


రాపూరు వద్ద రహదారి

**న**వంబర్ అంటేనే భారీ వర్షాలు లేదా పెనుగాలులతో కూడిన తుఫాన్లు, వాయుగుండాలతో గండాలు. నెల్లూరు జిల్లాకు ఇది అనాదిగా వస్తున్న ఆచారం. అయితే ఇటీవల అంటే గత పదేళ్లుగా ఈ ఆన వాయితీకి బ్రేకులుపడ్డాయి. అయిదేళ్లక్రితం **2015** లో కురిసిన భారీ వర్షాలు తప్ప అంతకు ముందు ఐదేళ్లుగానీ ఆ తరువాత అయిదేళ్ళు గాని పెద్దగా వర్షాలు కురిసిన సంఘటనలు లేవు. ఈ ఏడాది మాత్రం వానలు పాత రోజులను గుర్తుకు తెచ్చాయి. లాక్‌డౌన్ వల్ల పర్యావరణంలో వచ్చిన మార్పులో లేక ఏ ఇతర కారణమో తెలియదు గాని ఈ నవంబర్లో పుష్కలంగా వర్షాలు కురిశాయి. గత సంవత్సరాలలో ప్రతి దీపావళికి తప్పనిసరిగా వానలు పడేవి. అలా కురిసి కూడా చాన్నాళ్ళయ్యింది. ఈసారి మాత్రం ఆ ముచ్చట కూడా తీరిపోయింది. సరిగ్గా దీపావళి సమయంలో మంచి జల్లులు కురిశాయి.

నాలుగురోజుల పాటు అటు అధికారులకు ఇటు జిల్లా ప్రజలకు నిద్రలేకుండా చేసి ఫియర్ తెప్పించిన నివర్ తుఫాను ఎట్టకేలకు రాష్ట్రానికి పెద్దగా హాని చెయ్యకుండా పాండిచ్చేరికి 30 కిలోమీటర్ల ఉత్తరంగా మహాబలిపురానికి దక్షిణంగా మరక్కాణం వద్ద తీరం దాటేసింది. మూడు రోజులుగా తన కదలికలో స్పష్టత లేకుండా అటూ ఇటూ ఊగిసలాడుతుండిన నివర్ చివరికి తెలుగువాళ్ళను గట్టెక్కించి తాను తమిళనాట గట్టు దాటింది. (మిగతా 10వ పేజీలో)

## • తిరుపతి పార్లమెంటు
## వైకాపా అభ్యర్థిగా
# డాక్టర్ గురుమూర్తి



### బల్లి కుమారుడికి ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి

3లో

- 'దేశం' అభ్యర్థిగా పనబాక... ఎటూ తేల్చని భాజపా
- పోరుకు తెర లేచింది... ఇక సమరమే మిగిలింది



## చిరు వ్యాపారులకు, చేతి వృత్తుల వారికి
# 'తోడుగా జగనన్న'

(వివరాలు 11వ పేజీలో)




## జనం లేరు.. సేన లేదు...
# ఆయనొక్కడే మిగిలాడు



## పొలిటికల్ స్టార్ కాలేకున్న 'పవర్‌స్టార్'

**ఆ**ర్భాటంగా జనసేన పార్టీని ప్రారంభించి, ఆవేశంగా ఉపన్యాసాలిచ్చి **2019** ఎన్నికలలో ఆంధ్రా ఓటర్ల చేతిలో అవమానకరంగా ఓడిపోయిన పవర్‌స్టార్, పొలిటికల్ స్టార్‌గా ఎదగాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. మోడీ అంటే నాకు భయమా అని మాట్లాడి, తన నోటికొచ్చినట్లుగా భారతీయ జనతా పార్టీని ఆ పార్టీ నాయకులని విమర్శించిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఆ పార్టీతో జతకట్టిన విషయం తెలిసిందే.

మొన్నమొన్నటిదాకా దీక్షలూ వ్రతాలతో ఫామ్‌హౌస్‌కే పరిమితమైన పవన్... ఇప్పుడు హైదరాబాదు నగరంలో జరగనున్న గ్రేటర్ (మిగతా 10వ పేజీలో)

# రాజ్యాంగ దేవాలయాల పవిత్రతను కాపాడాలి

## - సభాపతులకు సూచించిన ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు






భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనది. రాజ్యాంగానికి లోబడే న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ విధులను నిర్వహించాల్సి ఉంటుంది. ఏ ఒక్క విభాగం కూడా రాజ్యాంగానికి అతీత మైంది కాదు. రాజ్యాంగ దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు సభాపతులు కృషిచేయాలి'.. అని రాజ్యసభ ఛైర్మెన్, భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు స్పష్టం చేశారు.

ఈనెల 25న గుజరాత్‌లోని కెవాడియాలో 'శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య సమన్వయమే సామరస్య పూర్వకమైన ప్రజాస్వామ్యానికి కీలకం' అనే ఇతివృత్తంతో జరుగుతున్న 80వ అఖిల భారత సభాపతుల సదస్సు ప్రారంభం సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కీలకమైన ఈ మూడు విభాగాలు వేటికవే ప్రాధాన్యమైన వ్యవస్థలని, జాతి నిర్మాణంలో ఈ వ్యవస్థలు సామరస్యపూర్వకంగా కలసి పనిచేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఈ మూడు విభాగాలు ఒకరి విధుల్లో మరొకరి జోక్యం కారణంగా వస్తున్న సమస్యలపై ఆయన ఆవేదన వ్యక్తంచేస్తూ..ఈ విధానం ఎవరికీ మేలు చేయదని, అంతిమంగా దేశ సమగ్రతకు రాజ్యాంగ పవిత్రతకు భంగం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టసభల పనితీరులో వస్తున్న మార్పులు ఆందోళనకరంగా ఉంటున్నాయన్నారు. ఉపరాష్ట్రపతి, సభాపతులను ప్రజాస్వామ్య దేవాలయ పూజారులుగా ఆయన అభివర్ణిస్తూ ఈ దేవాలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత వారిమీదనే ఉందన్నారు. శాసన వ్యవస్థ ప్రజాస్వామ్య మూలస్తంభమని, రాజ్యసభ ఛైర్మెన్ ఇక్కడ తీసుకునే నిర్ణయాలే కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలు తమ విధులు నిర్వహించేందుకు ఆధారాన్ని కల్పిస్తాయని, అయితే కొంతకాలంగా చట్టాలను రూపొందించే సంస్థలపై, చట్టసభల సభ్యులపై ప్రజాభిప్రాయం మారుతున్న విషయాన్ని గమనించాలన్నారు. చట్టసభల కార్యకలాపాలకు తరచుగా అంతరాయాలు కలగడం, చట్టసభల సభ్యుల ప్రవర్తన కారణంగా ప్రజల్లో వ్యతిరేక భావన పెరుగుతోందన్నారు.

### వాయిదాలు, అవాంతరాలతో సమయం వృధా :

2014లో కీలకమైన ప్రశ్నోత్తరాల సమయాన్ని రాజ్యసభలో 11 నుంచి 12 గంటలకు పెంచినప్పటికీ తరచుగా జరుగుతున్న అవాంతరాలతో ప్రశ్నోత్తరాల సమయంలో 60 శాతం వృధా అవుతున్న విషయాన్ని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా గుర్తుచేస్తూ ఇదెంతో ఆందోళనకరమైన విషయమన్నారు. ప్రజాస్వామ్య దేవాలయాల సభ్యత, మర్యాద, గౌరవాన్ని కాపాడాలని, అది కేవలం చర్చించడం, తార్కిక విశ్లేషణ, సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారానా సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. 1993లో ప్రవేశపెట్టిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలను ఆయన ప్రశంసిస్తూ పార్లమెంట్ తరపున బిల్లుల సంపూర్ణ పరిశీలన, నిధులు అడగడం సహా అనేక ఇతర అంశాల్లో ఈ కమిటీల పాత్ర అభినందనీయమన్నారు. ఇలాంటి కమిటీలను రాష్ట్ర అసెంబ్లీల్లోనూ ప్రవేశపెట్టడంపై దృష్టి సారించాలని సభాపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు పలు రాష్ట్రాల సభాపతులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### లక్ష్మణరేఖను దాటనక్కర లేదు

శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల సామరస్యపూర్వక విధుల నిర్వహణ అత్యవసరమని, రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులను అధిగమించి, లక్ష్మణరేఖను దాటాల్సిన అవసరం లేదని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ మూడు కీలకమైన వ్యవస్థలు ఇతరుల విధుల్లో జోక్యం చేసుకోకుండా తమ విధులను సరిగ్గా నిర్వహిస్తే ఏ సమస్యా ఉండదన్నారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న ఘటనలు పునరావృతం కాకుండా, రాజ్యాంగ పరిధులకు లోబడి పనిచేయాలని, మరొకరిపై తమదే పైచేయి అనే భావన ఎవరికీ ఉండకూడదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా సూచించారు.

• దామవరానికి ఇక మహర్దశ

# నెల్లూరు విమానాశ్రయానికి రెక్కలు




జిల్లా ప్రజలు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న విమానాశ్రయం రానే వస్తోంది. దగదర్తి మండలంలోని దామవరం వద్ద విమానాశ్రయానికి అనువైన స్థలం కోసం భూకేటాయింపులు జరిగి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో దామవరానికి మహర్దశ రాబోతోంది. దామవరం వద్ద సుమారు 1900 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మాణ పనులు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 23న ఆయన దామవరంలో విమానాశ్రయం నిర్మాణం కోసం సేకరించిన స్థలాలను పరిశీలించారు. భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విమానాశ్రయానికి సమీపంలోనే చిన్న, మధ్య, సూక్ష్మతరహా పరిశ్రమలు కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడి భూములకు సంబంధించి కొన్ని సమస్యలున్నాయని, విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూముల కేటాయింపు ప్రక్రియ దాదాపు పూర్తయిందని, విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కావలి ఆర్డీఓ జి.శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బహు గ్రంథకర్త.. శారదాకుమార్ కన్నుమూత



ఉత్తమ కవి, రచయిత, బహు గ్రంథకర్త, ఆధ్యాత్మికవేత్త శివరాజు వెంకట నరసింహారావు (శారదాకుమార్) ఇక లేరు. 88ఏళ్ళ వృద్ధాప్యంలో ఈనెల 19న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. 1932లో జన్మించిన శారదాకుమార్ ఆ తర్వాత బిఏ, బిటి చదువుకుని నెల్లూరు నీటిపారుదల శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైరయ్యారు. స్వతహాగా సౌమ్యుడు.. మంచి రచయిత. 'శారదా కుమార్' పేరుతో రచనలు చేసేవారాయన. 1968లో నెల్లూరులో శ్రీ రామకృష్ణ సేవాసమితిని స్థాపించి 37ఏళ్ళపాటు స్థాపక కార్యదర్శిగా ఎనలేని సేవలందించారు. కవిత్వంతో పాటు భక్తితత్వం కూడా ఎక్కువ. ఆధ్యాత్మిక అంటే మరింత మక్కువ. సామాజిక అవగాహనతో 'సామ్యగానం', గోరంతదీపాలు వంటి రచనలుచేసి మంచి కవిగా పేరు తెచ్చుకున్నారు. రుషికేష్, కోయంబత్తూరు ఆశ్రమాల్లో ఉన్న స్వామి దయానంద సరస్వతి వద్దకు వెళ్ళి గురుభక్తితో..ఎంతో శ్రద్ధతో వేదాంతాధ్యయనం చేసివచ్చారు. అంతేకాదు, కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ వేదాంతదేశికులు రచించిన ప్రఖ్యాత సంస్కృత కృతి 'దయాశతకం'ను భక్తులందరికీ అర్థమయ్యేరీతిలో తెలుగులోకి అనువదించారు. ఇవి ఆయన భక్తితత్వానికి, రచనా పటిమకు నిదర్శనంగా నిలుస్తాయి. సాయి బోధామృతం, శ్రీ రాఘవేంద్ర స్తోత్రం తాత్పర్యం, 'నీవు పూర్ణమే' వంటి సామాజిక, ఆధ్యాత్మిక రచనలతో ప్రఖ్యాతి గాంచారు. 1970 ప్రాంతాల్లో గొలగమూడిలోని అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారిని దర్శించుకున్న శారదాకుమార్, ఆ తర్వాత 'ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా' అనే వెంకయ్యస్వామి సూక్తిలోని వైశిష్ట్యాన్ని వివరిస్తూ రచించిన గ్రంథం విశేష ప్రాచుర్యం పొందింది. ఇంకా సద్గురు మలయాళస్వామి వారు, జిల్లేళ్ళమూడి అమ్మవారు, ఆనందాశ్రమం స్వామి రామదాస్ మహారాజ్ వారు, సేలంలోని అవధూత మాయిమా వంటి మహనీయుల దర్శనాలను, వారి అనుగ్రహాలను పొందిన ధన్యజీవి ఆయన. భక్తికవితా విశారదుడైన శారదాకుమార్ మృతికి విచారం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది 'లాయర్'!

### చట్టాలు, హక్కులపై..

# అవగాహన పెంపొందించుకోవాలి

#### భారత రాజ్యాంగ దినోత్సవంలో కలెక్టర్



భారత రాజ్యాంగంలో పొందుపరచిన చట్టాలను, హక్కులను పూర్తిస్థాయిలో అవగాహన కలిగించుకుని ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న కలెక్టరేట్ సిబ్బందితో కలెక్టర్ రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించి, భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులతో పాటు విధులు, బాధ్యతలు కూడా చాలా ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగ సమగ్రతను కాపాడేందుకు కట్టుబడి ఉండాలన్నారు. రాజ్యాంగం స్ఫూర్తిని అవగాహన చేసుకుని ప్రజల నుండి వచ్చే సమస్యల వినతి పత్రాలను వెంటనే పరిశీలించి సత్వర నిర్ణయాలు తీసుకుని పరిష్కరించాలన్నారు. అన్ని శాఖలకు మార్గదర్శకంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, అందరూ బాగా పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవి రమణ పాల్గొన్నారు.

### ఎంపి వేమిరెడ్డిని కలిసిన

# కార్పొరేషన్ల ఛైర్మెన్లు

రాష్ట్ర జంగమ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా నియమితులైన వావిలేటి ప్రసన్న, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ ఛైర్మెన్‌గా నియమితులైన కిషోర్‌సింగ్‌లు ఈనెల 23న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో గౌరవపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువతో సత్కరించారు. తమ నియామకానికి సహకరించినందుకు వేమిరెడ్డికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ కార్పొరేషన్‌లకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

• ఎన్నాళ్ళకెన్నాళ్ళకు....

# పెన్నా బ్యారేజీ పూర్తి కాబోతోంది




***2007లో నాటి ముఖ్యమంత్రి దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేసుకున్న నెల్లూరు పెన్నా బ్యారేజీ త్వరలో పూర్తి కానుంది. నెల్లూరీయుల చిరకాల వాంఛ తీరనుంది. తండ్రి భూమిపూజ చేసి మొదలు పెట్టిన ప్రాజెక్టును కొడుకు ప్రారంభించనున్నాడు. 2021 జనవరిలో ఈ బ్యారేజీని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తాడని నీళ్ళ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ప్రకటించాడు.***

ఈనెల 22న పెన్నా బ్యారేజీకి గేట్లను అమర్చే కీలక ఘట్టానికి మంత్రి పూజ చేసి అనంతరం పనులను పర్యవేక్షించాడు. ఆ తర్వాత రంగనాధస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న పెన్నాఘాట్ పనులను పరిశీలించాడు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లోని ఆయకట్టు స్థిరీకరణకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని భావించి ఈ నిర్మాణపు పనులు ప్రారంభించడం జరిగిందని, అయితే గత 13ఏళ్ళుగా ఈ పనులు నత్తనడక నడుస్తున్నాయన్నారు. రైతుల శ్రేయస్సే ధ్యేయంగా భావించే వైయస్ జగన్మోహన్‌రెడ్డి సిఎం అయ్యాక ఈ పనులు వేగం అందుకున్నాయని, ఈ ఏడాది డిసెంబర్‌లోగానే ఈ నిర్మాణపు పనులు పూర్తిచేయాలని అనుకున్నామని, అయితే కోవిడ్, వరదల కారణంగా ఇబ్బంది ఏర్పడిందని చెప్పాడు. డిసెంబర్ నెలాఖరుకు ఇక్కడ మొత్తం 57 గేట్లు ఏర్పాటుచేస్తామన్నాడు. వచ్చే జనవరి నాటికి పెన్నా బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తిచేసి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిచే ప్రారంభోత్సవం చేయిస్తామని తెలిపాడు. జిల్లాలోని అనేక నీటి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునీకరణకు 12 కోట్లు, కలిగిరి రిజర్వాయర్ ఆధునీకరణకు 21 కోట్లు విడుదలయ్యాయన్నారు. కండలేరు రిజర్వాయర్‌లో 68 టిఎంసిల దాకా నీటిని నిల్వచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిర్వాసితులకు పునరావాసం, పరిహారం ఇప్పించేందుకు కూడా కృషి జరుగుతోందన్నారు. కావలి కెనాల్ పనులన్నీ పూర్తి చేస్తామని, కండలేరులో ఈ ఏడాది 60 టిఎంసిల దాకా నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ముదివర్తి సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**నివర్ తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఈ నెల 26వ తేదీ సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశిస్తున్న జలవనరుల శాఖామంత్రి డాక్టర్ అనిల్**



**ఈ నెల 24వ తేదీ నెల్లూరులోని కళ్యాణి ఫిలిమ్స్ మాగుంట కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆనం విజయకుమార్‌రెడ్డి**

### వైకాపా అభ్యర్థిగా

## డాక్టర్ గురుమూర్తి



విశ్వసనీయతకు విధేయతకు పెద్దపీట వేయడంలో తండ్రికి తగ్గ తనయుడనిపించుకుంటున్నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి. తనను నమ్ముకున్న వాళ్లకి, కష్టకాలంలో తన వెంట నడిచిన వారికి ఆయన అగ్రతాంబూలం ఇస్తున్నాడు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక కోసం వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గురుమూర్తిని సిఫారసు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కుటుంబసభ్యులకే ఇస్తారా లేక మేరిగ మురళి లాంటి రాజకీయ నిరుద్యోగికి ఇస్తారా అనుకుంటున్న తరుణంలో గురుమూర్తి పేరును తెరపైకి తెచ్చాడు ముఖ్యమంత్రి. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన గురుమూర్తి ఫిజియో తెరపిస్టు. ముఖ్యమంత్రి జగన్, ఆయన సోదరి షర్మిలమ్మలు పాదయాత్ర చేసే సమయంలో నిత్యం వారి వెన్నంటే ఉండి సేవలందించేవాడు గురుమూర్తి. తననే నమ్ముకుని తన వెంట, తన చెల్లెలి వెంట నడిచిన గురుమూర్తిని ఇప్పుడు జగన్ పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించాడు.

### కళ్యాణ్‌కుమార్‌కి మండలి

బల్లి కుమారుడు కళ్యాణ్‌కి శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పిస్తామని పార్టీ హామీ ఇచ్చింది. తండ్రి వారసత్వంతో టిక్కెట్టు తనయుడికి రావాలనే సాంప్రదాయం పార్లమెంటు విషయంలో వర్తించదని కొంతమంది ముఖ్యమంత్రికి సూచించినప్పటికీ, ఆ కుటుంబానికి నేను మాటిచ్చాను కాబట్టి యంఎల్‌సి ఇవ్వాల్సిందే అని ముఖ్యమంత్రి ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం, దటీజ్ జగన్.

### పనబాక రెడీ....

కుమార్తె నిశ్చితార్థం పనులలో బిజీగా వుండిన పనబాక స్పీడ్ పెంచారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక కోసం తెలుగుదేశం పార్టీ ఆమె పేరు ప్రకటించిన నాటినుండి స్తబ్దుగా వున్న ఆమె, తన భర్త కృష్ణయ్యతో కలసి మంగళ, బుధవారాలలో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతో పాటు మరికొంతమంది తెలుగుదేశం నాయకులని కూడా కలసి వ్యూహ రచన చేస్తున్నారు.

## సంగీత, నృత్య పాఠశాలకి బాలు పేరు



నెల్లూరులోని ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలకు భారతీయ సినీ గాయకుడు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

## జిల్లాలో భారీగా 'నివర్' వానలు

నివర్ తుఫాన్ ప్రభావంతో నెల్లూరుజిల్లాలో బుధ, గురువారాల్లో భారీ వానలు కురిశాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ఇళ్ళలోంచి బయటకు రావడానికి ఎంతో ఇబ్బంది పడ్డారు. ఈనెల 25న జిల్లాలోని 46 మండలాల్లో మొత్తం వర్షపాతం 723.2 మిల్లీమీటర్లు నమోదు కాగా, 26న అంతకంటే ఎక్కువగా 6782.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సరాసరి జిల్లాలో 147.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇందులో అత్యధికంగా కోట మండలంలో 25న 90.2 మిల్లీమీటర్లు, 26న 247.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం మధ్యాహ్నం నాటికి జిల్లాలోని మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం మండలంలో 32.4 మిల్లీమీటర్లు, వరికుంటపాడు 52.2, కొండాపురం 79.0, జలదంకి 139.2, కావలి 522.2, బోగోలు 150.2, కలిగిరి 96.8, వింజమూరు 79.6, దుత్తలూరు 85.0, ఉదయగిరి 76.2, మర్రిపాడు 140.4, ఆత్మకూరు 155.2, ఏఎస్‌పేట 112.0, దగదర్తి 172.4, అల్లూరు 175.6, విడవలూరు 190.4, కొడవలూరు 174.8, బుచ్చిరెడ్డిపాళెం 155.2, సంగం 137.4, చేజర్ల 150.8, అనంతసాగరం 133.6, కలువాయి 148.6, రాపూరు 160.6, పొదలకూరు 167.8, నెల్లూరు 145.4, కోవూరు 168.8, ఇందుకూరుపేట 140.6, తోటపల్లి గూడూరు 153.0, ముత్తుకూరు 172.0, వెంకటాచలం 190.4, మనుబోలు 199.2, గూడూరు 191.4, సైదాపురం 160.4, డక్కిలి 214.2, వెంకటగిరి 235.8, బాలాయపల్లి 230.8, ఓజిలి 171.8, చిల్లకూరు 192.4, కోట 247.8, వాకాడు 154.8, చిట్టమూరు 83.6, నాయుడుపేట 180.6, పెళ్ళకూరు 92.4, దొరవారిసత్రం 118.2, సూళ్ళూరుపేట 146.6, తడ మండలంలో 108.6 మిల్లీమీటర్ల వంతున వర్షం కురిసింది. 25వ తేదిన మొత్తం 723.2 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే, 26 మధ్యాహ్నం నాటికి 6782.4మిల్లీమీటర్ల భారీ వర్షం నమోదైంది. తుఫాను ప్రభావంతో బుధ, గురువారాల్లో ఈదురు గాలులతో పాటు భారీ వాన కురిసింది. దీంతో ఎక్కడచూసినా రోడ్లు కాలువల్లా తయారయ్యాయి. అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి.

## తుఫాన్ బాధితులకు రెడ్‌క్రాస్ సేవలు



నివర్ తుఫాన్ ప్రభావంతో బాధలు పడుతున్న నెల్లూరు, వెంకటేశ్వరపురంలోని గాంధీ గిరిజన కాలనీ, నగరంలోని జయలలిత కాలనీ, గుర్రాలమడుగు సంఘంలోని లోతట్టు ప్రాంత ప్రజలకు ఈ నెల 26న రెడ్‌క్రాస్ నెల్లూరుజిల్లా శాఖ ఉచితంగా భోజన పొట్లాలను పంపిణీ చేసింది. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు బయ్యా ప్రసాద్, వై.సురేష్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ పాల్గొని రెడ్‌క్రాస్ ద్వారా వారు చేస్తున్న సేవలను అభినందించారు.

## 'ప్రభా'తం

# మరిన్ని సంస్కరణలు రావాలి

కోవిడ్ కారణంగా ఎదురైన కష్టనష్టాల నుంచి మనదేశ ఆర్థిక వ్యవస్థ క్రమేణా కోలుకుంటోందనడంలో సందేహం లేదు. అయితే, ఇంతటితోనే సరిపోదు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది జీవనోపాధికి వెన్నుదన్నుగా ఉన్న చిన్న పరిశ్రమలు ఇంకా ఆశించిన స్థాయిలో గట్టున పడలేదు. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాదు, ఆర్థికంగా అణగారిపోతున్న అన్ని రంగాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా మరిన్ని సంస్కరణలు వచ్చినప్పుడే దేశం ప్రగతిబాట పడుతుంది. అప్పుడే 'ఆత్మనిర్భర్ భారత్' సాకారమవుతుంది.

కరోనా మహమ్మారి కరకు కోరలకు ప్రపంచమే విలవిలలాడిపోతోంది. అన్ని దేశాల్లోనూ ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యాయి. సరైన సమయానికి లాక్‌డౌన్ ప్రకటించడం, కరోనా కట్టడికి కనీవినీ ఎరుగని విధంగా చర్యలు తీసుకోవడంతో మనదేశంలో ప్రాణాపాయాలు తగ్గి, నెమ్మదిగా కోలుకుంటున్నాం కూడా. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య అక్షరాలా ఆరుకోట్లు దాటిపోయి, మరణాల సంఖ్య 14 లక్షలకు పైగానే ఉన్న నేటి దుస్థితిలో బతికుంటే బలుసాకు తిని బతకొచ్చన్నట్లుగా ముందు ప్రాణాలు దక్కించుకోవడమే ముఖ్యం కనుక అన్ని దేశాలూ కోవిడ్ కట్టడికే ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నాయి.

మనదేశం కూడా కోవిడ్‌ను నివారించేందుకు సకల చర్యలు తీసుకుంటూనే ఉంది కనుక కరోనా నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య 86 లక్షల మందికి పైగానే ఉండడం, ఇంకా కేసులు వస్తూనే ఉన్నా, రికవరీ అయ్యేవారి సంఖ్య కూడా ఆశాజనకంగానే ఉండఢం అందరూ ఆనందపడే విషయం. ఈ సంగతటుంచితే కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ విధించడం తప్పనిసరైన స్థితిలో మన దేశంలో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై పోయింది. చిన్నా పెద్దా వ్యాపారాలన్నీ బాగా దెబ్బతిని కోట్లాదిమంది ఉపాధి కోల్పోయి ఎన్నో బాధలు పడ్డారు. నేటికీ ఇంకా కష్టాలు పడుతూనే ఉన్నారు కూడా. అనేక రకాల పరిశ్రమలు, సంస్థలు మూతపడి కార్మికులు వీధినపడ్డారు. వలస కూలీల జీవన పరిస్థితులు తలకిందులైపోయాయి. సాంకేతిక రంగంలోని అంకుర సంస్థలు 40శాతం దాకా నష్టాల బాటపట్టాయి. అనేకం మూతపడ్డాయి. ఈ దుర్భర మైన పరిస్థితులతో దేశంలోని అనేక రంగాలు అస్తవ్యస్తంగా మారాయి. అయినప్పటికీ ధైర్యం కోల్పోక తిరిగి నిలదొక్కుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం చేస్తున్న కృషి ఇప్పుడిప్పుడే ఫలవంతమవుతోంది. మళ్ళీ దేశ ఆర్థిక వ్యవస్థ కొంత మెరుగైన స్థితికి చేరుకుంటోంది. ఇదెంతైనా సంతోషకరం. కరోనా వల్ల అంకుర సంస్థలకు పెట్టుబడులు తగ్గిపోతాయనే అంచనాలకు భిన్నంగా ఆ సంస్థలు రెట్టించిన ఉత్సాహంతో ముందడుగు వేస్తూ లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుండడం ఎంతైనా శుభపరిణామం.

ప్రస్తుతం దేశంలోని అంకుర సంస్థలకు వస్తున్న పెట్టుబడులు స్వల్పంగా తగ్గినప్పటికీ, ఈ ఏడాది చివరికల్లా కనీసం 35 లక్షల మందికి పైగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంసిద్ధమవుతున్నాయని గణాంకాలు చెప్తున్నాయి. స్టార్టప్ ఇండియా పథకం కింద ఎంపికైన 5 ఉత్తమ అంకుర సంస్థలకు 50వేల డాలర్లను ఇస్తామని ఫేస్‌బుక్ ప్రకటించడం, 16 భారతీయ అంకుర సంస్థల అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ కంపెనీ చేయూతనందిస్తుండడం, కేంద్రం ప్రవేశపెట్టిన పలు పథకాలు ఈ సంస్థలకు మరింతగా ఊపునిస్తుండడం వగైరాలన్నీ కలసి వెరసి పరిశ్రమలు మళ్ళీ నిలదొక్కుకునేందుకు, తద్వారా ఎంతోమందికి ఉపాధినిచ్చేందుకు ఊతమిస్తున్నాయి. దీంతో భారత్ మునుపటి బాధల బాదరబందీ నుంచి వేగంగా కోలుకుంటున్నదనే చెప్పవచ్చు. అందుకు తగ్గట్టుగానే లాక్‌డౌన్ అనంతరం దేశంలో ఆర్థిక కార్యకలాపాలు భారీస్థాయిలో పెరుగుతున్నాయి కూడా. జీఎస్టీ వసూళ్ళు గతంలో కంటే పెరుగుతుండడం, విదేశీ పెట్టుబడులు గణనీయంగా వస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ అభియాన్ ఫలవంతమయ్యే దిశలో పయనిస్తూ దేశప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తోందని, దీంతో పాటు కోవిడ్ వల్ల ఉపాధి కోల్పోయిన పేదవర్గాల జీవనోపాధికి బాసటగా కేంద్రం ప్రకటించిన ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం కూడా లబ్దిదారులకు సక్రమంగా అందితే పేదప్రజలకు ఎంతో ఆసరా ఇచ్చినట్లవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

కరోనా నుంచి భారత్ ఆర్థికవ్యవస్థ కోలుకుంటోందని, పారిశ్రామిక రంగం తిరిగి పుంజుకుంటోందని, ప్రపంచదేశాల్లోని అనేక కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తుండడంతో అందుకు తగ్గట్టుగా ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం మరిన్ని ఆర్థిక సంస్కరణలపై దృష్టి పెడుతోందని, దేశంలో జీడిపి వృద్ధి రేటును కూడా మెరుగైన స్థానానికి వచ్చిందని, ఆర్థిక ప్యాకేజీలతో అన్ని రంగాలు గాడిలో పడ్డాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్తుండడం అందరికీ సంతోషం కలిగించే విషయమే. మునుపటికన్నా ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగైన స్థితికి చేరుకుందనడంలో, కోవిడ్ కారణంగా ఎదురైన ఎన్నో రకాల కష్టనష్టాల నుంచి మనదేశం క్రమేణా ఎంతగానో కోలుకుంటోందనడంలో ఎవరికీ ఎలాంటి అనుమానం ఉండనక్కర లేదు. అయితే, ఇంతటితోనే సరిపోదు. ఈ పరుగు చాలదు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింతగా మెరుగుపడాలి. అందుకు ప్రభుత్వాలు చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది. దేశవ్యాప్తంగా కోట్లాదిమందికి జీవనోపాధికి వెన్నుదన్నుగా ఉన్న చిన్న పరిశ్రమలు ఇంకా ఆశించిన స్థాయిలో గట్టున పడలేదు. ఈ కష్ట కాలంలో అవి మరింత చితికిపోకుండా అవసరమైన పథకాలను, సంస్కరణలన్నిటినీ ప్రవేశపెట్టి వాటిని సత్వరం ఆదుకోవాల్సి ఉంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఇప్పుడున్న జటిలమైన పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు తగిన ప్రణాళికలు రూపొందించి వాటికి అన్ని విధాలా తగిన తోడ్పాటు నందించాల్సిఉంది. లఘు పరిశ్రమలతో పాటు తయారీ రంగం కోలుకుని తిరిగి ప్రగతి బాట పట్టడానికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మరింత ఉత్సాహంతో పరిశ్రమల రంగంలోకి వచ్చేందుకు మరిన్ని సంస్కరణలు రావాల్సివుంది. దీంతోపాటు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు, వాటికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు మరింతగా కృషి చేయాలి. అంతేకాదు, కేవలం ఒక్క పారిశ్రామిక రంగంలోనే కాదు.. కోవిడ్ నేపథ్యంలో ఆర్థికంగా అణగారిపోతున్న అన్ని రంగాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు మరిన్ని ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. కరోనా వంటి మహమ్మారిని సైతం ధీరత్వంతో ఎదుర్కొని, ఎన్నో కష్టాల నుంచి గట్టెక్కి ఎంతో గుండె నిబ్బరంతో ముందుకు సాగుతున్న మన భారతావని ఈ దశలో ఇంకా మేలైన విధానాలతో అన్ని రంగాల్లోనూ ఆశించిన విధంగా అభివృద్ధిని సాధించాల్సి ఉంది. అప్పుడే అందరూ ఆకాంక్షిస్తున్న 'ఆత్మనిర్భర్ భారత్' పరిపూర్ణమైన స్థాయిలో సాకారమవుతుంది.

# యూజీసి పెన్షనర్ల విన్నపం




యూజీసి-2016 సవరించిన పెన్షన్ పొందే లెక్చరర్ల గోడును దయచేసి ఆలకించండి. విశ్రాంత ఉపన్యాసకులు (పెన్షనర్లు), లెక్చరర్ల కాలనీలో విశ్రాంతి పొందక మొరపెట్టుకొనడం ఏమిటని భావించక మా బాధలను అర్థము చేసుకోండి. 2019లో యూజీసి 2016లో సవరించిన పెన్షన్‌ను చంద్రబాబునాయుడు గారు 2016 నుంచి అరియర్స్‌తో సహా అమలుపరచమని ఉత్తర్వులిచ్చారు. 2019 ఫిబ్రవరిలో 70ఏళ్ళు నిండిన యూజీసి పెన్షనర్లకు 10%(బేసిక్‌పై) అదనపు పెన్షన్ కూడా మంజూరు చేశారు. కరువుబత్తెం కూడా ఇచ్చారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల సవరించిన పెన్షన్ అమలుకు నోచుకోలేదు. కరువుబత్తెం, అదనపు పెన్షన్ అప్పటి ఎలక్షన్ల ముందే అమలుపరచారు.

ఒకటిన్నర సంవత్సరం తర్వాత 2020లో 10% అదనపు పెన్షన్, చాలా కాలంగా ఇస్తున్న మెడికల్ అలవెన్సు నిలిపివేసి ఏప్రిల్‌లో సవరించిన పెన్షన్ అమలుపరచారు. కానీ అదనపు పెన్షన్, మెడికల్ అలవెన్స్ నిలిపినదాని వల్ల మాకేమి లాభం చేకూరలేదు. పెన్షన్ బకాయిల ఊసే లేదు. 2018 జులై, 2019లో ఇవ్వాల్సిన కరువుబత్తెం 2021, 2022లో ఇచ్చేటట్లు ఉత్తర్వులిచ్చారు. ఇలాగే ప్రతీది ఆలస్యంగా, వాయిదాలలో ఇవ్వడం మాకు నిరాశ కల్గిస్తున్నది. 2020లో ఇవ్వాల్సిన కరువు బత్తెం పూర్తిగా రద్దు చేశారు. ఏప్రిల్ 20లో నిలిపి వేసిన పెన్షన్ సగభాగం రెండు నెలల్లో 12% వడ్డీతో సహా ఇవ్వమని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇవ్వడం చాలా ముదావహం. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. కాని ప్రభుత్వం వడ్డీ ఇవ్వలేమని పెన్షన్ మాత్రం జనవరి లోగా ఇస్తామని చెప్పి ఉత్తర్వు జారీ చేసింది. 2016 నుంచి రావాల్సిన పెన్షన్ బకా యిలు(అరియర్స్)కు కావాల్సిన యూజిసి గ్రాంటును కేంద్రప్రభుత్వము విడుదల చేసినా, దాని మీద నిర్ణయం తీసుకోలేదు.

పెన్షనర్లలో కొందరు ఒంటరిగా జీవిస్తున్నారు. నిరాధారంగా ఉన్నారు. కొందరు వృద్ధాశ్రమాల్లో ఉన్నారు. 2018 నుంచి పెరిగిన పెన్షన్ కొరకు నిరీక్షించి కొందరు స్వర్గస్తులైనారు. కావున వృద్ధులను కనికరించి, వారికి రావాల్సిన బకాయిలన్నింటినీ వాయిదాలు వేయక వీలైనంత త్వరలో కనీసం రెండు వాయిదా ల్లోనైనా చెల్లించమని ప్రభుత్వాన్ని అర్థిస్తున్నాము.

**భట్టారం భవానీశంకర్,**
**రిటైర్డ్ వైస్‌ప్రిన్సిపాల్,**
**విఆర్‌సి, నెల్లూరు.**

**లాయర్**

**పాఠకులకు మనవి**
**మా(మీ) లాయర్ పత్రికకు**
**సమాచారం / లేఖలు**
**పంపదలచిన వారు**
**9866314741 నంబరుకు**
**వాట్సాయాప్ ద్వారా గాని, లేదా**
**lawyerpatrika@gmail.comకి**
**ఈ-మెయిల్ ద్వారా గాని**
**పంపవలసిందిగా విజ్ఞప్తి.**
**పోస్టల్ చిరునామా :**
**ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,**
**మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.**
**- సం/-**

# భక్తిఛానల్ విషయం చదివి బాధేసింది

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామివారి వైభవాలను నిత్యం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ఇళ్లల్లో దర్శింపజేస్తున్న శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ గురించి ఆవేదన చెందుతూ పద్మభూషణ్ బిరుదాంకితులు వరప్రసాద్‌రెడ్డిగారు గత వారం 'లాయర్' పత్రిక వేదికగా చేసిన విన్నపాలు చూసి బాధ కలిగింది. వరప్రసాద్‌రెడ్డి వంటి ఆధ్యాత్మిక, సాహిత్య ఆరాధకుడి మనసును సైతం గాయపరచేలా ఎస్‌విబిసిలో జరుగుతున్న అరాచకాల గురించి చదివి హృదయం చలించింది. సాక్షాత్తు ఆ దేవదేవుడి ప్రతినిధులుగా, తిరుమల కొండపై అనునిత్యం జరిగే అనేక విశేషాలను, అంగరంగ వైభవంగా స్వామివారికి జరిగే వేడుకలను, కొండపై చోటుచేసుకునే అద్భుతాలను భక్తులకు అందించాల్సిన ఛానల్ సిబ్బంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రాకులాడడం దుర్మార్గం. ఛైర్మెన్, ఇ.ఓ, జె.ఇ.ఓ త్రయం కఠినంగా వ్యవహరించి ఇలాంటి దుష్టశక్తులను ఛానల్ నుండి బయటకి తరిమేయాలి. సాయికృష్ణ యాచేంద్ర లాంటి బహుముఖ ప్రజ్ఞాశాలి నేత్రత్వంలో ఛానల్ కొత్త పుంతలు తొక్కి శ్రీవారి భక్తులకు మరింత చేరువ కావాలంటే ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి ఛానల్ పురోభివృద్ధికి ఈ త్రయం సహకరించాలి.

**కె. యం. భూషణం, తిరుపతి.**

# మత విద్వేషాలు రెచ్చగొట్టేలా గ్రేటర్ ఎన్నికలు

గ్రేటర్ హైదరాబాదు కార్పొరేషన్‌కి జరుగుతున్న ఎన్నికలలో కొన్ని పార్టీల మాటలు మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయి. రాజకీయ నాయకులు, పార్టీలు తమ పబ్బం గడుపుకోవడానికి ఎప్పుడో ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎలక్షన్ల కోసం మతం, కులం అంటూ ప్రజల మనస్సులో విషం నింపడం మంచి సంప్రదాయం కాదు. గతంతో పోలిస్తే హైదరాబాదు ఇప్పుడు చాలా ప్రశాంతంగా వుంది. అభివృద్ధి కూడా బాగా జరుగుతూ ప్రపంచస్థాయిలో వ్యాపారసంస్థలను ఆకట్టుకొంటోంది. ఈ నాయకులకు చేతనైతే నగర ప్రజల జీవన విధానాలను పెంపొందించే విధంగా వారు చేపట్టబోయే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఓటర్లను ఆకట్టుకోవాలి. కానీ ఇలా మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేయడం సబబు కాదు. వీరి వ్యాఖ్యలవల్ల హైదరాబాదులో మళ్ళీ మత ఘర్షణలు చెలరేగితే అది క్షమించరాని నేరమే. ఆ పాపం వీరిదే అవుతుంది.

**పి. రాంప్రసాద్, హైదరాబాదు.**

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

GOGAADI




24hr ASSISTANCE

ACROSS 2 STATES

75,000 KM Assist Network

Avail your Road Assistance.

Contact us at

81 8605 8605

Download the App Now

Download on the App Store

GET IT ON Google Play

*All other services are available across Hyderabad & Nellore

# నెల్లూరు కబుర్లు

### మహిళల రక్షణ కోసం..

## 'అభయ్ యాప్'

ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం అభయ్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న ఆయన తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి ఈ యాప్‌ను ప్రారంభించి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల్లోని కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. అభయ్ యాప్‌ను రవాణాశాఖ ఆధ్వర్యంలో అందుబాటులోకి తెచ్చామని, ఆటోలు, క్యాబ్‌లలో ఈ యాప్ డివైజ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు ఈ బటన్ నొక్కితే చాలు పోలీసులు, అధికారులు వెంటనే వచ్చి వారికి రక్షణ కల్పిస్తారని వివరించారు. దేశంలోనే తొలిసారిగా 'దిశ' చట్టాన్ని ప్రవేశపెట్టి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామన్నారు. అక్కచెల్లెమ్మల భద్రత కోసం ఈ అభయ్ యాప్‌ను ప్రవేశపెట్టామన్నారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ అభయ్ యాప్ ద్వారా మహిళలకు నిరంతరం రక్షణ కల్పించవచ్చని, ఈ యాప్‌ను మహిళలందరూ డౌన్‌లోడ్ చేసుకొని, ఆపదలో ఉన్నప్పుడు ఆ సమాచారాన్ని పోలీసులకు చేరవేయవచ్చన్నారు.

## పేదలను మభ్యపెడుతున్న వైకాపా

**- బీద రవిచంద్ర విమర్శ**



తాము అధికారంలోకి వస్తే పేదలకు ఉచితంగా టిడ్కో ఇళ్లను ఇస్తామని హామీ ఇచ్చిన వైకాపా ఇప్పుడు మాట తప్పిందని, ఒకరకం ఇళ్ళు మాత్రమే ఉచితంగా ఇస్తామంటూ పేదలను మభ్యపెట్టి మోసం చేస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర విమర్శించారు. ఈనెల 24న నెల్లూరులోని తన నివాసంలో ఆయన ఇళ్ళ లబ్ధిదారులతో కలసి నిరసనలో పాల్గొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నిర్మించిన హౌస్ ఫర్ ఆల్ ఇళ్లు అన్నింటినీ ఉచితంగా పేదలకు అందజేయాలని టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నిరసన చేపట్టిన నేపథ్యంలో బీద రవిచంద్ర మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తిచేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, నిర్మాణం పూర్తయిన ఇళ్ళను గతంలోని లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జెన్ని రమణయ్య, పనబాక భూలక్ష్మి, పడవల కృష్ణమూర్తి, సత్యనాగేశ్వరరావు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు. కాగా, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపు మేరకు నగర నియోజకవర్గంలోని 28 డివిజన్లలో టిడిపి నాయకులు ఇళ్ల లబ్ధిదారులతో కలసి నిరసనలు చేపట్టారు.

### రెడ్‌క్రాస్‌పై...

## ఆరోపణలు సముచితం కాదు

**కన్వీనర్ అజయ్‌బాబు**

ప్రజలకు ఎంతగానో సేవలు చేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థపై ఆరోపణలు చేయడం తగదని, ఇకనైనా లేనిపోని నిందలు ఆపాలని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ సమయంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ద్వారా రోగులకు అవసరమైన రక్తం అందించడంలో రెడ్‌క్రాస్ సేవలు అందరికీ విదితమేనని, కోవిడ్‌తో బాధపడుతున్న వారికి ప్లాస్మా అందించడంలో దేశంలోనే ద్వితీయ స్థానంలో నెల్లూరు రెడ్‌క్రాస్ ఉండడం అందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇంతగా సేవలు చేస్తున్నప్పటికీ రెడ్‌క్రాస్‌పై కొందరు నిరాధారమైన ఆరోపణలు చేస్తూ రెడ్‌క్రాస్‌ను అప్రదిష్ట పాలుచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇలా చేయడం సముచితం కాదని అన్నారు. అనునిత్యం కొందరు చేస్తున్న దుష్ప్రచారాలు తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వారిపై నిందలు వేస్తూ ఇబ్బంది పెట్టడం సరికాదని తెలిపారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నవారిని ధైర్యంగా ఎదుర్కొని రాబోయే రోజుల్లో రెడ్‌క్రాస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషిచేద్దామని, 78 సార్లు స్వయంగా రక్తదానం చేసిన వ్యక్తిగా, ఒక మంచి సేవా కార్యక్రమమైన ప్లాస్మా విషయాన్ని ఎవరూ వక్రీకరించ వద్దని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

### చెన్నైకి ఆర్టీసి..

## రైట్ రైట్

ఎట్టకేలకు చెన్నైకి ఆర్టీసి బస్సులు నడుస్తున్నాయి. ఈనెల 25 నుంచి జిల్లాలోని 10ఆర్టీసి డిపోల నుంచి ఆర్టీసి బస్సులు చెన్నైకి వెళ్తున్నాయి. కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో గత మార్చి నెలాఖరు నుంచి చెన్నైకి ఆర్టీసి బస్సులు నడవలేదు. సుదీర్ఘ విరామం అనంతరం ఇప్పుడు చెన్నైకి బస్సులు నడుస్తుండడంతో ప్రయాణీకులకు ఊరట లభించినట్లయింది.

### రక్తదానం చేసిన

## ఎన్‌సిసి క్యాడెట్లు

ఎన్‌సిసి డే పురస్కరించుకుని ఈనెల 24న కెప్టెన్ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 10-ఏ నావెల్ యూనిట్ సౌజన్యంతో ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్‌సిసి ఆఫీసర్లు రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. నగరంలోని విఆర్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎన్‌సిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ శర్మ, ఎన్‌సిసి ఆఫీసర్లు ప్రభాకర్, విజయ్, మహేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### హెడ్మాస్టర్ల సంఘం..

## కొత్త కార్యవర్గం

నెల్లూరులోని దర్గామిట్ట బాలికల ఉన్నత పాఠశాల ఈనెల 22న ఏపి హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘానికి అధ్యక్షునిగా ఆర్.మురళీధర్, ప్రధాన కార్యదర్శిగా బాణాల మునిరత్నం ఎన్నిక కాగా, పుదూరులోని జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మనోజ్‌కుమార్ నాయుడుపేట డివిజన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

### రైతు వ్యతిరేక చట్టాలను

## రద్దు చేయండి

కేంద్రప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేకచట్టాలను రద్దుచేయాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు కోటిరెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులోని దామవరపు చెన్నమ్మ భవన్‌లో ఈనెల 22న జరిగిన రైతు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘాల నాయకులు శ్రీరాములు, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీపతి, తుళ్ళూరు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకమరాజు, నాయకులు నిరంజన్‌రెడ్డి, షానవాజ్, రామరాజు పాల్గొన్నారు.

### బిజెపిని

## బలోపేతం చేయాలి

**సురేంద్రరెడ్డి**

భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, అందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 22న నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న ఎంవిఎస్ కల్యాణమండపంలో జరిగిన బిజెపి నెల్లూరు నియోజకవర్గ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బిజెపి నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విఆర్‌ఏల

## సమస్యలు తీర్చాలి

జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకు(విఆర్‌ఏ)లకు పేస్కేల్ ఇవ్వాలని, నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్‌ఏలుగా నియమించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా పెంచలనరసయ్య కోరారు. ఈనెల 22న నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విఆర్‌ఏలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేసి వారి సమస్యలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రసాద్, విఆర్‌ఏల సంఘం నాయకులు సుబ్బయ్య, అమీర్, భాస్కం తదితరులు పాల్గొన్నారు.

### గుర్రం జాషువా

## 125వ జయంతి

విఖ్యాత కవి గుర్రం జాషువా 125వ జయంతి కార్యక్రమం ఈనెల 22న నెల్లూరులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నగరంలోని స్వతంత్ర పార్కులో అంబేద్కర్ సేవాసమితి, నటరాజ కళా సమితి ఆధ్వర్యంలో, బృందావనం, పొగతోటల్లోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల పర్యవేక్షణలో భక్తులు ప్రదర్శించిన భక్తచింతామణి, సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం నాటకాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. జిల్లా కళాకారుల సంఘం నాయకుడు పిన్ను గంగాధర్‌రెడ్డి తదితరుల పర్యవేక్షణలో ఈ నాటకాల ప్రదర్శన జరిగింది.

### రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో

## మాస్కులు, సబ్బులు పంపిణీ



నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఇటీవల నగరంలోని బోడిగాడి తోటలోని పేదలు, నిరాశ్రయులకు మాస్కులు, సబ్బులు పంపిణీ చేసి, వారికి కరోనా పట్ల ఎంతగా అప్రమత్తంగా ఉండాలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తద్వారా కరోనా నిరోధానికి సహకరించాలని సూచించారు. కరోనా నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని, చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవాలని చెప్పారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు భయ్యాప్రసాద్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంటా వెంకటరవికుమార్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామికి

## నేత్రపర్వంగా శీవేలి ఉత్సవం



నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 22న నేత్రపర్వంగా శీవేలి ఉత్సవం నిర్వహించారు. అయ్యప్పస్వామికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల అయ్యప్పస్వామి నామస్మరణలతో ఆలయ మార్మోగింది. చక్రవర్తి, నీరజ, మందిపాటి దుష్యంత్‌రెడ్డి, చందూష ఉభయకర్తలుగా వ్యవహరించారు. అయ్యప్పస్వామి సేవా సమాజం అధ్యక్షకార్యదర్శులు సుకుమార్, శేషగిరిరావు, సూర్యనారాయణరెడ్డి, రమణయ్య తదితరులు ఈ ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

### గౌతమ బుద్ధుని

## బోధనలు ఆదర్శనీయం



గౌతమ బుద్ధుని బోధనలు ఆదర్శనీయమని, బుద్ధుని విగ్రహాలను గ్రంథాలయాలు, విద్యాలయాల్లోను, నగరంలోని ప్రధాన కూడళ్ళలోను ఏర్పాటుచేయాలని నెల్లూరులోని గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. నెల్లూరు స్వతంత్ర పార్కులో ఈనెల 22న ఏర్పాటైన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరవ రావప్ప, జయప్రకాష్ మాట్లాడుతూ గౌతమబుద్ధుని బోధనలు అన్ని తరగతుల వారికి పాఠ్యాంశాలుగా చేర్చాలన్నారు. అయోధ్య రామమందిరం ప్రాంగణంలో కూడా బుద్ధ విగ్రహం ఏర్పాటుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రామమోహన్, గోపీకృష్ణ, సుధాకర్‌రావు, శేషగిరిరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# 'నివర్ తుఫాన్'తో జిల్లాలో భారీ వర్షాలు



'నివర్ తుఫాన్' ప్రభావంతో జిల్లాలో మంగళవారం వేకువ నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. అంతటా ముసురు పట్టిన వాతావరణం అలముకుంది. దీంతో ప్రజాజీవనం స్తంభించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి ఉధృతంగా మారింది. తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. చెరువులకు గండ్లు పడే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## తీర ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్ :

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడ్డారు. మరోవైపు జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ తుఫాన్ వల్ల ప్రజలకు ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులను, సిబ్బందిని పదేపదే ఆదేశిస్తున్నారు. విద్యాసంస్థలకు శుక్రవారం దాకా మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు. తుఫాన్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు వాకాడు మండలంలోని సముద్ర తీరప్రాంతాలైన కొండూరుపాళెం, తూపిలి పాళెం, వాలమేడు తదితర ప్రాంతాల్లో ఈనెల 24న పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు జాగ్రత్తగా ఉంటూ సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి నిత్యావసరాల పంపిణీకి సిద్ధం చేయాలని ఆదేశించారు. తూపిలి పాళెం బీచ్ వద్ద మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులు తమ సామగ్రిని భద్రపరచుకుని ముందుజాగ్రత్తతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ గోపీనాథ్, ఎంఇఓ ఎన్.బాబు తదితరులున్నారు.

# ఆలయాలకు కార్తీక శోభ



ఎంతో పుణ్యప్రదమైన కార్తీకమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని ఈనెల 23న జిల్లాలోని శివాలయాలు కార్తీక దీపాలతో కళకళలాడాయి. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు వచ్చి పరమేశ్వరుని దర్శించుకుని తరించారు. ఆలయాల్లో కార్తీక దీపాలు, ఆకాశదీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. శివ నామస్మరణలతో ఆలయాలు హోరెత్తాయి. నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలాస్థానేశ్వరాలయంలో స్వామివారికి విశేష పుష్పాలంకరణ, ప్రాకారోత్సవం నిర్వహించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని శ్రీ మీనాక్షిదేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి వారి ఆలయంలో విశేష పూజలు చేశారు. మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వరాలయంలో, ములుముడి బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ హరిహరనాథాలయం, నవాబుపేటలోని శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం, వేదాయపాళెంలోని మల్లికార్జునస్వామి ఆలయం, మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలోని భవాని శంకరస్వామి ఆలయం, మూలాపేటలోని శంకరమఠంలో కొలువై ఉన్న కామాక్షీదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్ పేటలోని శివాలయం.. తదితర ఆలయాల్లో స్వామివార్లకు అఖండ దీపారాధనలు, విశిష్టపూజలు, అభిషేకాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా శివాలయాలన్నీ కార్తీకశోభతో దేదీప్యమానమయ్యాయి. అనేకమంది భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా నదుల్లోనూ, సాగరతీరాల్లోనూ స్నానాలాచరించి సమీపంలోని ఆలయాల్లో పూజలు చేసుకున్నారు. కోవిడ్ నేపథ్యంలో భక్తులందరూ నియమ నిబంధనలు పాటిస్తూ..మాస్కులు ధరించి, భౌతిక దూరం ఆచరిస్తూ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

## నాయకుల డిమాండ్

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ రజకసంఘం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈనెల 22న సంగంలో జరిగిన రజకసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి-ఏలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. రజకులు విద్య, ఆరోగ్య తదితర రంగాల్లో ఎంతోకాలంగా వెనుకబడి ఉన్నారని, వారిని అన్నివిధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సంగం మండల రజక సంఘం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా వేములపాటి రోశయ్య, గౌరవ సలహాదారుగా వంగల్లు శ్రీహరి, అధ్యక్షునిగా తుమ్మల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షునిగా ఎలమందల మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శిగా దారకంపాటి రమణయ్య, కోశాధికారిగా ఎం.బాలకృష్ణ, కార్యదర్శిగా కామేపల్లి శ్రీహరి, సంయుక్త కార్యదర్శిగా పి.మధు, మహిళా మండల కన్వీనర్‌గా పెంచలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# రైతుల బకాయిలు చెల్లిస్తాం

జిల్లాలోని ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన సుమారు 160 కోట్ల రూపాయలను ఈ వారంలోనే చెల్లించేస్తామని, రైతులకు వారి బ్యాంకు అకౌంట్లలోనే ఈ డబ్బు జమ అయ్యేలా చూస్తామని జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన కోవూరులోని వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు తాను మంత్రి అనిల్‌ను కలిసి ధాన్యం బకాయిల విషయం చెప్పగా మంత్రి వెంటనే స్పందించి బకాయిలు తీర్చేందుకు తగు ఏర్పాట్లు చేశారన్నారు. వైకాపా మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మాజీసర్పంచ్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జయంపులో వైద్యశిబిరం

బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో ఈనెల 22న శివాజీ యూత్‌ఫౌండేషన్, నోవా బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు బాలకోటేశ్వరరావు, వేణుగోపాల్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జయంపు సొసైటీ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, గురుశేఖర్, సాయి, ఎల్‌వి సుబ్బయ్య పాల్గొన్నారు.

## పినాకిని గాంధీ ఆశ్రమంలో..

# సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఉన్న పినాకిని గాంధీ ఆశ్రమంలో ఈనెల 22న సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని గోశాలలో గోపూజ చేశారు. తొలుత ఆశ్రమ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



# శ్రీసిటీని సందర్శించిన కమల దళం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌సి సోము వీర్రాజు ఈనెల23న శ్రీసిటీని సందర్శించారు. ఆయనతోపాటు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖకు చెందిన నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించి శ్రీసిటీ ప్రగతిని వివరించారు. శ్రీసిటీ అభివృద్ధిని పరిశీలించిన అనంతరం శ్రీసిటీ యాజమాన్యం కృషిని సోము వీర్రాజు అభినందించారు. శ్రీసిటీలో 50వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు లభించడం, వారిలో 50శాతం మంది మహిళలు కావడం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో శ్రీసిటీ చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని వీరు కొనియాడారు.

# శ్రీసిటీకి ఐయస్ఓ గుర్తింపు







భారతదేశంలోనే అత్యంత వేగంగా పురోగతిని సాధిస్తున్న శ్రీసిటీ మరో రెండు ప్రతిష్ఠాత్మక ఐయస్ఓ సర్టిఫికెట్లతో జాతీయ గుర్తింపుని సాధించింది. ఇప్పటికే అనేక అవార్డులను, జాతీయ అంతర్జాతీయ సర్టిఫికెట్లను సాధించిన శ్రీసిటీ ఇప్పుడు రెండు ఐయస్ఓ సర్టిఫికెట్లను తన ఖజానాలోకి చేర్చుకుంది.

ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఇది అరుదైన గౌరవం అని, రెండు ఐఎస్ఓ ధృవీకరణ పత్రాలు శ్రీసిటీకి దక్కడం ఎంతో విశేషమని అన్నారు. నాణ్యత మరియు పర్యావరణ హిత వ్యవస్థల ఉత్తమ నిర్వహణకు సంబంధించి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ) నుండి ఇటీవల ఈ ధృవీకరణ పత్రాలు వచ్చిన సందర్భంగా, ఇలాంటి ఉత్తమ స్థాయి లభించడం శ్రీసిటీ ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయి అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంకితభావంతో తాము అందించే నాణ్యమైన సేవలకు, పర్యావరణ హిత కార్యక్రమాల అమలులో తమ నిబద్ధతకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఇంతటి విశేష గుర్తింపును సాధించినందుకు శ్రీసిటీ బృందాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కాగా జాతీయస్థాయిలో ఇప్పటికే శ్రీసిటీ ఇండియన్ గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్ గుర్తింపును, అసోచామ్ వారి గ్రీన్ అండ్ ఎకో ఫ్రెండ్లీ మూవ్‌మెంట్ సస్టైనబిలిటీ సర్టిఫికేషన్‌లను కూడా దక్కించుకోవడం విశేషం. శ్రీసిటీ నిర్వాహకులకు అభినందనలు.

# శ్రీసిటీలో 'ఐలా' సమావేశం



ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) సమావేశం ఇటీవల శ్రీసిటీలో జరిగింది. ఏపిఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు పలు వసతులు, సమస్యల విషయమై చర్చించారు. పలు వసతులు సమకూర్చేందుకు తగు ప్రతిపాదనలను కూడా ఈ సమావేశంలో సమీక్షించుకున్నారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# జిల్లా పోలీసుల సేవలు భేష్!

## - అభినందించిన డిఐజి త్రివిక్రమవర్మ



నెల్లూరు జిల్లా పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారంటూ గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మ అభినందించారు. దక్షిణ భారతదేశంలోనే నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయానికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడం గర్వకారణమన్నారు. అందుకు కృషి చేస్తున్న జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 23న ఆయన నెల్లూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ భాస్కర్‌భూషణ్‌కు ఐఎస్ఓ సెక్రటరీ అభిలాష్ నన్నీ సమక్షంలో సర్టిఫికెట్‌ను అందజేసి ప్రశంసించారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని డైనమిక్ ఈ-బీట్ సిస్టంను రూపొందించి పక్కాగా అమలుచేస్తున్నందుకు జాతీయస్థాయిలో ఈ గుర్తింపు లభించిందని, సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా క్లిష్టతరమైన కేసులను కూడా త్వరితగతిన ఛేదించడం జరుగుతోందని తెలిపారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందించేందుకు మరింతగా పోలీసు సిబ్బంది కృషి చేయాలన్నారు. నేరాల కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసులపై దృష్టి పెట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం హైవే మొబైల్స్, నేషనల్ హైవే ప్రతినిధులతో ప్రతి పదిహేను రోజులకోసారి సబ్ డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటుండాలని సూచించారు. జైలు మానిటరింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని డిఐజి ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సేవా యాప్‌ను ప్రవేశపెట్టిందని, ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ వెంకటరత్నం, ఐఎస్ఓ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఆయన దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు.

## పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రభాకర్

నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో, ఈ ఆసుపత్రిలోని జనరల్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రభాకర్‌ను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంగా నియమిస్తూ ఈనెల 23న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## మైపాడు బీచ్‌లో సందడే సందడి

ఈనెల 22న ఆదివారం రోజున ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌లో సందర్శకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన పర్యాటకులు వారి కుటుంబసభ్యులు, స్నేహితులతో కలసి బీచ్‌లో స్నానాలు చేసి సంతోషంగా గడిపారు. కార్తీకమాసం కావడంతో నదీ స్నానం, సముద్ర స్నానం పుణ్యప్రదం కనుక మరికొందరు యాత్రికులు కూడా వచ్చి సముద్ర స్నానాలు చేశారు. అనంతరం సమీపంలోని ఆలయా లను దర్శించుకున్నారు.

## తారకేశ్వరస్వామికి కార్తీక పూజలు

కోవూరు మండలం ఇనమడుగులోని ప్రఖ్యాతమైన శ్రీ సత్యానందస్వామి ఆశ్రమంలో ఈనెల 22న కార్తీకమాస పూజలు వేడుకగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థ స్వామీజీ నేతృత్వంలో స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంల్లో ఆశ్రమం కార్యదర్శి నాగేశ్వరరావు, పురుషోత్తమస్వామి పాల్గొన్నారు.

## చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్ళూరుపేటలో కొలువై ఉన్న శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 22న ఎంతో భక్తిశ్రద్ధలతో చండీయాగం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు యాగశాలలో అమ్మణ్ణి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం యాగం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు వల్లుత్తూరు మధుసూదన్, శాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

**www.lawyerpatrika.com**

# గూడూరు డివిజన్ వార్తలు

## డాక్టర్ గురుమూర్తి ఎంపీ కాబోతున్నాడు

### - సిఎం వైయస్ జగన్



తిరుపతి పార్లమెంట్‌కు సంబంధించి అత్యంత చిన్నవయసులో డాక్టర్ గురుమూర్తి ఎంపి కాబోతున్నాడని ఆంధ్రప్రదేశ్ సిఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 24వ తేదీ సిఎం జగన్ తిరుపతి పర్యటన సందర్భంగా తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు డాక్టర్ గురుమూర్తిని వెంటబెట్టుకుని ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జగన్ తిరుపతి పార్లమెంటు ఎన్నికల్లో భారీమెజార్టీతో విజయం సాధించేలా చర్యలు తీసుకోవాలని నేతలకు సూచించారు. గురుమూర్తికి ఆల్ ది బెస్ట్ అంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గురుమూర్తి సిఎం జగన్‌కు ఆయన చిత్రపటాన్ని బహూకరించాడు.

## వాహనాల దారి మళ్లింపు



- రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి

జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్నందున పంబలేరు వంతెన వద్ద వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపాడు. ఈ నెల 24న ఆయన విలేకరులతో మాట్లాడుతూ గూడూరుకు వచ్చే వాహనాలను పోటుపాలెం కూడలి మీదుగా నెల్లూరు వైపు వెళ్లే వాటిని పాత బైపాస్ రహదారి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పాడు. రూరల్ ఎస్.ఐ పుల్లారావు నేతృత్వంలో ఆయా ప్రధాన కూడళ్లలో పోలీసు బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నాడు. మరోవైపు పంబలేరు వద్ద వరద పెరిగే అవకాశం ఉండటంతో వాహన రాకపోకలను నిలిపివేసినట్లు వెల్లడించాడు.

## మౌనం వీడి... ప్రచారంలోకి పనబాక



తిరుపతి పార్లమెంటు ఉపఎన్నిక బరిలో కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి ఇక పూర్తి స్థాయిలో దిగనున్నారు. ఇప్పటి వరకు ఆమె మౌనం వహించడంపై అనేక ప్రచారాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ఆమె ప్రకటించింది. ఈనెల 25వ తేదీ హైదరాబాద్‌లోని పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నివాసంలో తన భర్త పనబాక కృష్ణయ్యతో సహ ఆమె చంద్రబాబును కలిసి తిరుపతి ఉపఎన్నికకు సంబంధించి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మరో మాజీమంత్రి నారాయణ పాల్గొన్నారు. ఉపఎన్నికల్లో అమలు చేయాల్సిన వ్యూహాలను ఖరారు చేశారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 7 సెగ్మెంట్లలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ పూర్తిస్థాయిలో ఎన్నికలకు సన్నద్ధంగా ఉందని వారు చంద్రబాబుకు తెలిపారు.

## అజాగ్రత్త వహిస్తే.. భారీ మూల్యమే



- సి.ఐ దశరథరామారావు

కరోనా వైరస్ ప్రభావం తగ్గిందని ప్రజలు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని గూడూరు పట్టణ సి.ఐ దశరథరామారావు హెచ్చరిస్తున్నాడు. సర్కిల్ కార్యాలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా లాక్‌డౌన్ సడలింపులతో వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ప్రారంభమయ్యాయని, అయితే ఎక్కడా ప్రజలు సామాజిక దూరం పాటించడం లేదని, గుంపులు గుంపులుగా ఉంటున్నారని, అది కాక కొందరు మాస్కులు లేకుండా తిరుగుతున్నారని... దీనివల్ల కరోనా వైరస్ మళ్ళీ విజృంభించే అవకాశం ఉందని, పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కరోనా వైరస్ తీవ్రత పెరుగుతోందని, మళ్ళీ లాక్‌డౌన్ విధించే అవకాశాలు ఉన్నాయని, కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించాడు.

## విద్యుత్ బకాయిలపై దృష్టి

### - ఎస్.ఇ విజయకుమార్‌రెడ్డి



విద్యుత్ బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని ఆ శాఖ ఎస్.ఇ విజయకుమార్‌రెడ్డి అన్నాడు. నెల్లటూరు ప్రాంతంలోని డిస్కం కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ నియంత్రికలు మరమ్మత్తులకు గురైతే వెంటనే బాగుచేయాలని సూచించాడు. గృహ వినియోగదారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశాడు. ఆయన వెంట డిస్కం డి.ఇ సోమశేఖరరెడ్డి, అధికారులు అమీర్‌జాన్, మల్లికార్జున్, రాము తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాతల కళ్లల్లో

# ఆనందం కోసమే.. 'వైఎస్సార్ జలకళ'

**- ఎమ్మెల్యే కాకాణి**

రాష్ట్రంలోని పేద రైతుల కష్టాలు తీరిపోయి వారి కళ్ళల్లో ఆనందం చూసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న ఆయన పొదలకూరు మండలంలోని తోడేరు పంచాయతీలో ఒక రైతు పొలంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంత రైతుల సమస్యలు విన్న జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని అన్నదాతల సంక్షేమం కోసం ప్రవేశపెట్టారన్నారు. అందుకు పొదలకూరు సంకల్పయాత్ర వేదికకావడం తనకెంతో ఆనందంగా ఉందని, ఇక్కడి సభలోనే అప్పుడు వైయస్ జగన్ పేదరైతులకు ప్రభుత్వమే బోరు వేయిస్తుందని హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేరుస్తూ అన్నదాతల్లో ఆనందం నింపుతున్నారని అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటిదాకా 412 మంది రైతులు బోర్లు వేయించుకునేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. రైతన్నల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఎంపిడిఓ ఎం.నారాయణరెడ్డి, వైయస్సార్సీపి నాయకులు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయం

**- కొనియాడిన వక్తలు**

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, యానాదుల అభ్యున్నతికి విశేషంగా శ్రమించిన మహనీయుడు వెన్నెలకంటి రాఘవయ్యకు ఎస్సీఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు పులి చెంచయ్య ఆధ్వర్యంలో ఈనెల 24న ఘనంగా నివాళులర్పించారు. వెన్నెలకంటి రాఘవయ్య వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అమాయకులైన యానాదులపై అప్పట్లో ఉన్న సిటి యాక్ట్‌ను తొలగించి వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించేందుకు వెన్నెలకంటి రాఘవయ్య చేసిన కృషి ఎనలేనిదని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మధు, లక్ష్మీప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. తొలుత రాఘవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి అందరూ నివాళులర్పించారు.

# సత్యసాయిబాబా జయంతి వేడుకలు

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 95వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని తోటబడిలో ఈనెల 23న ఘనంగా వేడుకలు నిర్వహించారు. సత్యసాయిబాబా భక్తుడు గాదంశెట్టి సుధాకర్‌రావు సత్యసాయి జీవితం, బోధనలు గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కిన్నెర మాల్యాద్రి 250 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దివంగత సుంకు సురేంద్ర, శకుంతలమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు రామ్మోహన్, సాయిప్రకాష్ ఈ కార్యక్రమం నిర్వహించారు.

### అక్రమార్కులను

# సహించే ప్రసక్తే లేదు

**- ఎస్ఇబి కొత్త ఏఎస్పీ శ్రీలక్ష్మి**

జిల్లాలో అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని, అక్రమాలు అరాచకాలను సహించే ప్రసక్తే లేదని ఈనెల 24న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) కొత్త ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కె.శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. మద్యం అక్రమ రవాణా, అనధికార విక్రయాలు ఇసుక అక్రమాలు, గుట్కా, గంజాయి విక్రయాలు వగైరాలన్నిటినీ నిరోధించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధ నలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్క డైనా అలాంటి అక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే 8897122516కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. చిత్తూరుజిల్లాకు చెందిన శ్రీలక్ష్మి గతంలో పోలీసుశాఖలో డిఎస్పీగా పనిచేసి, గత సెప్టెంబరు 30న ఏఎస్పీగా పదోన్నతి పొంది ఈ జిల్లాకు ఇప్పుడు ఎస్ఇబి ఏఎస్పీగా నియమితులయ్యారు.

# విజేతలకు బహుమతులు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఈనెల 23న నెల్లూరు రేబాలవారివీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సిహెచ్ ప్రసాద్, ప్రజాసైన్స్ వేదిక నెల్లూరు పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# మాకూ ప్రత్యేక కార్పొరేషన్ కావాలి

**- సిఎంకు ఆర్య క్షత్రియ సంఘం నాయకుల వినతి**



ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్య క్షత్రియ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఇటీవల విజయవాడలో సమావేశమైన 13 జిల్లాల ఆర్య క్షత్రియుల సంఘం నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కోరుతూ తీర్మానించారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షలమందికి పైగానే ఆర్య క్షత్రియులున్నారని, వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్య క్షత్రియ కులస్తులు అధికశాతం మంది చెక్కపని, బంగారుపని, పెయింటింగ్, బొమ్మలు తయారుచేయడం, దేవాలయాలపై బొమ్మలు చెక్కడం, దేవుని వాహనాలు తయారు చేయడం తదితర నైపుణ్యాత్మక వృత్తుల్లో జీవనం సాగిస్తున్నారని, తమకు ప్రభుత్వం తగు చేయూతనందించాలని వారు కోరారు. ఆర్యక్షత్రియులకు, ఉపకులాల వారికి బిసిబి ధృవీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. ఆర్య క్షత్రియుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయడం ఎంతో అవసరమని వారు విన్నవించారు. అనంతరం ఆర్య క్షత్రియ సంఘం రాష్ట్ర సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# వేదగిరిలో.. పవిత్రోత్సవాలు

నెల్లూరు సమీపంలోని నరసింహకొండపై వెలసివున్న వేదగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఈనెల 2 నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈనెల 27వ తేదీ వరకు జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు అంకురార్పణ, స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. సాయంత్రం నరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశిష్టపూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఇ.ఓ పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# భక్తవరదుడు..వేదగిరి శ్రీ లక్ష్మీనృసింహుడు

***భక్తవరదుడు.. కోరిన కోర్కెలు నెరవేర్చే దేవుడు.. నరసింహకొండపై వెలసిన వేదగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారు. పురాణకాలం నుంచి, ఎంతో పురాతన కాలం నుంచి ఇక్కడున్న ఆదిలక్ష్మీదేవి సమేతుడైన నృసింహస్వామి కోవెల భక్తులకు కొంగుబంగారంగా ఉంది. నెల్లూరుకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో పచ్చదనంతో.. కొండలు కోనలతో విలసిల్లుతున్న నరసింహకొండపై ఉన్న ఈ ఆలయం నెల్లూరును పరిపాలించిన పల్లవరాజుల కాలంలో నిర్మితమైనట్లు చరిత్ర. ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించి పురాణ కథనాలతో పాటు, ఆలయ నిర్మాణానికి చెందిన ప్రాచీన చరిత్ర ఎంతో ఆసక్తికరమైనవి. దుష్టశిక్షణకు శిష్టరక్షణకు అవతరించిన అవతారమూర్తి.. శ్రీ లక్ష్మీనృసింహస్వామివారు. కృతయుగంలో స్వామివారిని ఇక్కడ సప్తరుషులు ప్రతిష్ఠించారని పురాణ కథనం.***



**మన దేవాలయాలు 22**

**ఆలయ చరిత్ర :**

ఎంతో ప్రాచీన కాలం నుంచి నరసింహకొండ వేదగిరిగా ప్రసిద్ధి. బ్రహ్మాండపురాణం ప్రకారం.. కృతయుగంలో కశ్యప మహర్షితో పాటు సప్తరుషులు లోకకల్యాణం కోసం ఆ భగవం తుని ప్రార్థిస్తూ ఈ కొండపై యాగాలు చేశారు. సప్తరుషుల యాగంతో ప్రసన్నుడైన శ్రీ లక్ష్మీనృసింహస్వామి వైశాఖ శుద్ధ చతుర్ధశి నాడు.. స్వాతి నక్షత్రంలో సాయం సంధ్యాసమయంలో ఈ కొండపైనున్న గృహాంతర్భాగంలో జ్యోతి రూపంలో దర్శన మిచ్చాడని, కశ్యప మహర్షి ఆ జ్యోతి కనిపించిన ప్రదేశంలో ఆదిలక్ష్మీదేవి అమ్మవారి సమేతంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రతిష్ఠించాడని అంటుంటారు.

**పల్లవరాజులు నిర్మించిన ఆలయం :**

క్రీ.శ 970–995 ప్రాంతాల్లో నెల్లూరును పాలించిన పల్లవరాజుల హయాంలో విక్రమసింహవర్మ అనే పల్లవరాజు శ్రీ లక్ష్మీ నృసింహస్వామికి ఆలయం నిర్మించారని ప్రాచీన చరిత్ర పేర్కొంటోంది. పల్లవుల అద్వితీయమైన శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన ఈ ఆలయం అప్పట్లోనే ఈ ప్రాంతానికి మకుటాయమానంగా ఉండేది. అనంతర కాలంలో సుమారు 500 సంవత్సరాల క్రితం రెడ్డిరాజుల పాలనంలో ఈ ఆలయానికి అత్యద్భుతమైన రీతిలో ఏడంతస్తుల రాజగోపురం నిర్మించారని స్థల పురాణం పేర్కొంటోంది. ఆలయం ఎదుట సుమారు 40 అడుగుల ధ్వజస్తంభం భక్తులందరికీ కనువిందు చేస్తూంటుంది. గుహాల యంగా ఉన్న స్వామివారి గర్భాలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆరడుగుల అర్చా రూపంలో భక్తులకు దర్శనమిస్తుంటాడు. స్వామివారి సన్నిధికి సమీపంలోనే 20 అడుగుల ఎత్తున్న కొండపై ఆదిలక్ష్మీదేవి అమ్మవారి సన్నిధి ఉంది. ఇక్కడున్న సంతానవృక్షానికి ముడుపులు కట్టుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుంది. పిలిచిన పలికే దైవంగా ప్రఖ్యాతి చెందిన కొండికాసులవాడైన శ్రీ లక్ష్మీనృసింహస్వామిని భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. స్వామివారి హుండీలో కానుకలు సమర్పిస్తే విషపురుగుల బాధ ఉండదని, గ్రహబాధలు, పీడపీడలు వగైరాలేమీ ఉండవని, కష్టాలన్నీ తీరిపోతాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రతిఏటా నృసింహజయంతిని పురస్కరించు కుని ఎంతో వైభవంగా ఈ కొండపైనున్న వేదగిరి లక్ష్మీనృసింహ స్వామికి జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించి తరించడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు.


**పుణ్యప్రదమైన సప్త కోనేరులు :**

ఈ ఆలయానికి దక్షిణభాగంలో సప్తరుషులు నిర్మించిన ఏడు హోమ గుండాలు ఆ తర్వాత కాలక్రమంలో ఏడు కోనేరులుగా మారాయి. సప్తరుషుల యాగానికి నిదర్శనంగా సప్త కోనేర్లు నేటికీ ఈ కొండపై ఉన్నాయి. ఎంతో పుణ్యప్రదమైన ఈ కోనేర్లలో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగిపోతాయని ప్రతీతి. యాగ సంరక్షణ కోసం తొలుత సప్తరుషులు ఇక్కడ ప్రసన్నలక్ష్మీదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామి ఆలయాన్ని కూడా నిర్మించారని పురాణ కథనం. నేటికీ ఈ ఆలయంలో పంచశిరస్సులతో కూడిన నాగతల్పంపై శ్రీ గోవిందరాజస్వామి వారు శయనమూర్తిగా భక్తులకు దర్శనమిస్తాడు. అందుకే భక్తులు ముందుగా యాగసంరక్షకుడైన శ్రీ గోవిందరాజస్వామిని, ప్రసన్నలక్ష్మీదేవిని దర్శించుకున్న తర్వాతనే శ్రీ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నప్పుడే తమ యాత్ర పరిపూర్ణమయినట్లు భావించాలని స్థలపురాణం పేర్కొంటోంది.


# కళ్యాణ వైభవం...!




సీనియర్ జర్నలిస్టు, 'లాయర్' వారపత్రిక సబ్-ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు - సుగుణల కుమారుడు **కళ్యాణ్ - బిందుప్రియ**(ఒంగోలు వాస్తవ్యులు కంచర్ల రామారావు - రాఘవమ్మల కుమార్తె)ల వివాహం నవంబర్ 21వ తేదీ ఒంగోలులోని టి.టి.డి కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.




ప్రముఖ న్యాయవాది, కావలి వాస్తవ్యులు చింతాల వెంకటరావు - పద్మావతిల కుమారుడు **వెంకట సాయి చిరంజీవి - యామిని** (నెల్లూరు వాస్తవ్యులు గోపిశెట్టి రామప్రభాకరరావు - మంజులవాణిల కుమార్తె)ల పెళ్ళి నవంబర్ 19వ తేదీ నెల్లూరులోని హోటల్ మినర్వా గ్రాండ్ నందు వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభ దీవెనెలు.




గూడూరు వాస్తవ్యులు బైరిశెట్టి రాజేంద్రప్రసాద్ - లావణ్యల కుమార్తె (దొరస్వామినాయుడు - వసంతమ్మల మనుమరాలు) **మౌనిక - యోగాంజనేయ ప్రసాద్** (గూడూరు వాస్తవ్యులు కోటిగారి ప్రభాకర్ - నాగమణిల కుమారుడు)ల కల్యాణం నవంబర్ 26వ తేదీ గూడూరు సిఆర్ రెడ్డి కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# నెల్లూరుని నీట ముంచిన.. 'నివర్'

(మొదటి పేజీ తరువాయి)

వాయుగుండంతో ఆంధ్రాకి పెనుగండం తప్పినా.. దాని ఫలితంగా కురిసిన వర్షాలతో జిల్లాలో పలు గ్రామాలు ప్రాంతాలు నీట మునిగాయి. రాష్ట్ర సరిహద్దు తడ నుండి జిల్లా సరిహద్దు తెట్టు వరకు భారీ వర్షాలు కురిశాయి. కొన్ని చోట్ల రహదారులపైకి సైతం భారీగా నీళ్ళు రావడంతో ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. చిన్న చిన్న వర్షాలకు సైతం జలమయమయ్యే నెల్లూరు నగర కాలనీలు, రోడ్లు యధావిధిగా నీట మునిగాయి. ఇటీవలే మంచి వాన కురిసి రాత్రికి రాత్రి నగరమంతా నీట మునిగిన అనుభవం ఉండడంతో కొన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ఈసారి అధికారులు ముందుగానే మేల్కొనడంతో పట్టణంలో ప్రజలకి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. విజయవాడ నుండి నెల్లూరుకి చేరుకున్న నీళ్ళ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పలు ప్రాంతాలలో పర్యటించాడు. అధికారులతో సమీక్ష జరిపి ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించాడు.

అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పినా జిల్లాలో ఆగకుండా కురిసిన కుంభవృష్టి కారణంగా తీవ్రస్థాయిలో పంట నష్టం జరిగింది. ముఖ్యంగా నెల్లూరుతో పాటు చిత్తూరు, కడప జిల్లాల్లో సైతం పలు ప్రాంతాలు నీట మునిగాయి. తీరం దాటినప్పటికీ మరో రెండు రోజులు ఈ నివర్ ప్రభావం ఉంటుందని అధికారులు చెప్తున్న తరుణంలో మళ్ళీ ఇంకొక వాయుగుండం కూడా పుట్టే ప్రమాదం లేకపోలేదని మరికొన్ని రోజులు ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించడం గమనార్హం.

# ఆయనొక్కడే మిగిలాడు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలలో భాజపా తరఫున ప్రచారం చేస్తున్నాడు. 25వతేదీ ఢిల్లీకి వెళ్ళిన పవన్, భాజపా జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాతో సమావేశమయ్యాడు. అంతవరకూ బాగానే వుంది. నడ్డాతో సమావేశం అయిన అనంతరం ఆయన పార్టీ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనే హాస్యాస్పదంగా వుంది. పవన్ కళ్యాణ్ రాజకీయ పరిపక్వతకు ఆ ప్రకటన అద్దం పడుతోంది.

నడ్డా ఆహ్వానం మేరకు తాను ఢిల్లీకి వచ్చానని, పోలవరం ప్రాజెక్టు, అమరావతి ఉద్యమం, తిరుపతి ఉపఎన్నికలో అభ్యర్థి ఎంపికపై సంయుక్త కమిటీ వంటి అంశాలను నడ్డాతో ఈ జాతీయ నాయకుడు చర్చలు జరిపినట్లు ఆ ప్రకటనలో ఉంది. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని, ప్రాజెక్టు త్వరగా పూర్తికావడానికి ఇచ్చిన హామీ ప్రకారం నిధులు విడుదల చేయాలని ఎప్పటినుండో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడుతూనే వుంది. ఇప్పుడు కొత్తగా పవన్‌బాబు ఇచ్చిన సలహా ఏమిటో అర్థం కావడం లేదు. ఇక రాజధాని అమరావతిలోనే ఉండాలనేది బీజేపీ, జనసేన నిర్ణయం అంటూ ఆ పత్రికా ప్రకటన హెడ్‌లైన్స్. రాజధాని విషయంలో నిర్ణయం తీసుకోవడానికి ఈయన ఎవరు, ఈయనకు తోడు వాళ్లెవరు...? అన్నది ఇప్పుడు రాజకీయ మేధావులకు అర్థం కాని ప్రశ్న. ఒకవేళ రాజధాని విషయంలో భారతీయ జనతా పార్టీకి ఏదైనా స్పష్టత వుంటే ఆ నిర్ణయాన్ని ప్రకటించడానికి కొమ్ములు తిరిగిన భాజపా నేతలు రాష్ట్రంలో ఉన్నారు. ఆ పార్టీ నిర్ణయాన్ని ఈయన ప్రకటించడమేమిటన్నది కూడా వారి ప్రశ్న .

ఇక మూడవది తిరుపతి అభ్యర్థి ఎంపిక విషయంలో సంయుక్త కమిటీ. భారత దేశ ప్రజల ఆశీస్సులతో ఊహించని మెజారిటీతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన భాజపాకి, తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని పెట్టే విషయంలో, రాష్ట్రంలో తాను పోటీ చేసిన రెండుచోట్ల నుండి ఓడిపోవడమే కాకుండా, 175 స్థానాల్లో కేవలం ఒక్క స్థానాన్ని మాత్రమే దక్కించుకోగలిగిన పవన్‌కళ్యాణ్ సలహా అవసరమా..? ఇదికూడా రాజకీయ మేధావులకు అర్థంకాక తలపట్టుకుంటున్నారు.

ఇప్పుడాయన వెంట జనమూ లేరు, ఆయన పార్టీకి పూర్తిస్థాయిలో పోరాడే సేనా లేదు, తెలుగుదేశంతో నేరుగా తగాదా పెట్టుకుంటున్న భారతీయ జనతా పార్టీకి రాష్ట్రంలో కాపుల అవసరం కాబట్టి పవన్ కళ్యాణ్‌ను పక్కన పెట్టుకుంటున్నారనే సంగతి రాజకీయ అజ్ఞానులకు కూడా తెలుసు. తన వల్ల భాజపా లాభ పడాలని చూస్తుందని పవన్ భావిస్తున్నాడు. ఇలా ఒకటిరెండు సార్లు బీజేపీని కించపరిచేలా ప్రకటనలిస్తే వాళ్ళు కూడా ఈయనకు కటీఫ్ చెప్పేస్తారు. ఇప్పటికే కొన్ని సినిమాలకు పవన్ సంతకం పెట్టినట్లు తెలుస్తోంది. హాయిగా వెళ్లి సినిమాలు చేసుకోక ఈయనకెందుకు ఈ రాజకీయాలు అని ఆయన పార్టీ వాళ్ళే అంటున్నారని వినికిడి. పవన్‌ను నమ్ముకుని బరిలో దిగిన కొంతమంది రాజకీయ నిరుద్యోగులు ఇప్పటికే తమ భవిష్యత్తు అర్థంకాక సతమతమవుతున్నారని సమాచారం. పవర్‌స్టార్‌గా ఖ్యాతి గడించిన ఈ ఫిలిం స్టార్ ఇలాగే ప్రవర్తిస్తే పొలిటికల్ స్టార్‌గా ఎదగడం కలే.

# విద్యార్థులకు మాస్కులు పంపిణీ



పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, మాదనపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శ్రీసిటీ ఫౌండేషన్ వారు ఇటీవల మాస్కులను వితరణగా అందించారు. కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. శ్రీసిటీ సెక్యూరిటి ఇన్‌చార్జి రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, ప్రధానోపాధ్యాయులు కాశీమధు, కె.మునిమోహన్ పాల్గొన్నారు.

## అహ్మద్‌పటేల్ సేవలు చిరస్మరణీయం

**- డిసిసి అధ్యక్షుడు చేవూరు**



ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు, సోనియాగాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్‌పటేల్ మృతికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్‌రెడ్డి ఈనెల 26న ఒక ప్రకటనలో తన విచారం వ్యక్తం చేశాడు.

కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, పార్టీకి ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని అన్నాడు. అహ్మద్ పటేల్‌కు ఆయన ఘన నివాళులర్పించారు. కరోనాతో పోరాడుతూ తుదిశ్వాస విడిచిన అహ్మద్‌పటేల్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని చేవూరు పేర్కొన్నాడు.

## కాలధర్మం

## కస్తూరిదేవి 'రవి'



కస్తూరిదేవి రవిగా పేరు గడించిన టి.రవికుమార్ నవంబర్ 19న తన 54వ ఏట కన్ను మూశాడు. కస్తూరిదేవి విద్యాసంస్థలలో 33 సంవత్సరాలుగా క్లర్కుగా, అకౌంటెంట్‌గా రవి తన సేవలందించేవాడు. విద్యాసంస్థలకు సెక్రటరీ మరియు కరస్పాండెంట్లుగా పనిచేసిన శుభప్రదమ్మకి, జెవి రెడ్డికి రవి నమ్మినబంటు.

ఈ విద్యాసంస్థలకు సంబంధించి వారికి కూడా తెలియని ఎన్నో కీలక విషయాలు రవికి తెలుసు. కొన్ని క్లిష్ట సమయాల్లో బైలాస్‌ను క్షుణ్ణంగా చదివి సమస్యను పరిష్కరించడంలో కూడా రవి ముఖ్యపాత్ర పోషించేవాడు. సంస్థకు సంబంధించిన అన్ని వ్యవహారాలలో ఆయన జోక్యం ఉండేది. స్వల్ప అనారోగ్యంతో ఉండిన రవిని ఇటీవలే దివంగతులైన జెవి రెడ్డి మరణం మరింత కృంగదీయడంతో ప్రాణాలు వదిలాడు. ఆయనకు భార్య అరుణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రవి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### చిరు వ్యాపారులకు, చేతివృత్తుల వారికి

# తోడుగా జగనన్న

- మాట నిలబెట్టుకున్న యువనేత
- 10 లక్షల మందికి వెయ్యికోట్ల రుణాలు



**రాజకీయాల్లో చెప్పడమే కానీ చెయ్యడం ఉండదన్నది అందరికీ తెలిసిందే. కొందరు నాయకుల మాటలు మాత్రం కోటలు దాటుతుంటాయే కానీ ఆచరణకు వచ్చేసరికి శుష్క వాగ్దానాలు.. శూన్యహస్తాలే. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి, యువనేత జగన్ విషయంలో మాత్రం అలా ఉండదు. చెప్పింది చెప్పినట్లు చెయ్యాల్సిందే. అనుకున్నది అనుకున్నట్లు జరగాల్సిందే. మాట చెప్తే తిరుగుండదు. మాట తప్పడం కానీ..మడమ తిప్పడం కానీ ఉండదు. అలా ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చే క్రమంలోనే తాజాగా పేదవర్గాలకు అండగా 'జగనన్న తోడు' వచ్చింది. చిరువ్యాపారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు తెచ్చింది.**

పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి జగన్ చూపుతున్న శ్రద్ధ రాష్ట్ర ప్రజలను ఎంతగానో సంతోషపెడుతోంది. నవరత్నాల పథకాలు కూడా ప్రజలకు అత్యంత త్వరలోనే అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రం ఆర్థికస్థితి బాగా లేకున్నప్పటికి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలనే దృఢసంకల్పంతో యువనేత అడుగులు వేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 25న రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా 'జగనన్న తోడు' పథకం ప్రారంభమైంది. నిత్యం మన ముంగిళ్లకు వచ్చి మన అవసరాలు తీరుస్తున్న చిన్న వ్యాపారుల జీవితాల బాగు కోసం కూడా యువనేత జగన్ దృష్టి సారించాడు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా, మీకు నేను తోడుగా ఉంటానని చెప్పిన మాట నిలబెట్టుకుంటూ, ఆ బడుగుజీవులకు ఆసరాగా ఈ పథకానికి శ్రీకారం చుట్టాడు.

## లక్షలాదిమంది పేదలకు వరం :

రోడ్లపై తోపుడుబండ్లు పెట్టుకుని కూరగాయలు, తినుబండారాలు, రకరకాల వస్తువులు అమ్ముకునే చిరువ్యాపారులు రాష్ట్రంలో లక్షలాదిమంది ఉన్నారు. ఎంతోమందికి ఇలాంటి చిరువ్యాపారాలే జీవనోపాధి. వీరివల్లనే మన ఇంటి గడప వద్దకు ఎన్నో సరుకులు మనకు అందుతున్నాయి. అయితే వారు, వారి కుటుంబాలు మాత్రం ఎప్పుడూ కష్టాల్లోనే ఉంటుంటాయి. వ్యాపారం కోసమో లేదా కుటుంబ అవసరాల కోసమో డబ్బు అవసరమైతే వారు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకుని వాటిని సక్రమంగా తీర్చలేక నానా అవస్తలు పడుతుంటారు. సంప్రదాయ వృత్తిదారుల పరిస్థితి కూడా అంతే. వారి బండి కదలకపోతే బతుకుబండి సాగదు. వారిని గురించి ఎంతోకాలంగా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ అందుకు 'నేనున్నా' నంటూ 'జగనన్న తోడు' నిలిచాడు. అలాంటి పేదవర్గాలకు వెన్నుదన్నుగా ఉండేలా రాష్ట్రంలోని దాదాపు పది లక్షల మందికి వెయ్యికోట్ల రుణాలిచ్చే పథకాన్ని ప్రారంభించి వారందరి జీవితాలకు ఆసరాగా నిలబడ్డాడు. బ్యాంకర్లతో కలసి ఈ పథకం సిద్ధం చేశారు. ఈ పథకం కింద లబ్దిదారులు తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే ఏటా 60 నుంచి 100 కోట్ల దాకా వడ్డీ చెల్లిస్తుంది. దానిని పదేళ్ళకు తీసుకుంటే వెయ్యికోట్లు అవుతుంది. లబ్దిదారులకు 10వేల వరకు వడ్డీలేని రుణాలు లభిస్తాయి. సున్నా వడ్డీతో ఏవిధమైన తాకట్టు లేకుండా 10వేల రూపాయల దాకా రుణం ఇచ్చేందుకు జగన్ ప్రభుత్వం సంసిద్ధం కావడం పట్ల ప్రజల్లో సంతోషాతిరేకాలు వెల్లడవుతున్నాయి.

## చిరువ్యాపారుల కష్టాలను స్వయంగా చూశా - సిఎం జగన్

చిరువ్యాపారుల జీవితాలను స్వయంగా చూశాను. వారిని చిరువ్యాపారులు అనడం కన్నా ఆత్మగౌరవంతో సమాజానికి అమూల్యమైన సేవలందిస్తున్నవారిగా భావించాలి. వారి కష్టాలు చూశాను. వారి బాధలు విన్నాను. వారికి మరింత మేలు చేయాలనే సంకల్పంతోనే 'జగనన్న తోడు' పథకం ప్రారంభిస్తున్నానని జగన్ స్పష్టం చేశారు. ఈనెల 25న తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి ఈ పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇది పేదల మేలు కోరే ప్రభుత్వమని చెప్పారు. పల్లెల నుంచి పట్టణాల దాకా వీధుల్లో చిరు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న లక్షలాదిమంది అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు మనందరి ప్రభుత్వం ఇవాల్టి నుంచి మరింత తోడుగా ఉంటుందన్నారు.

## జిల్లాలో 60,867 మందికి 'జగనన్న తోడు'

ఈ పథకం కింద జిల్లాలో 60,867 మంది లబ్దిదారులకు వారి వారి అకౌంట్లలో 60.86 కోట్ల రూపాయల మొత్తాన్ని జమ చేశారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నెలరోజులదాకా గడువుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు.

# ఇంకాస్త తగ్గిన.. కరోనా

జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు బాగా నెమ్మదించినా పూర్తిస్థాయిలో మాత్రం తగ్గిపోవడం లేదు. వందల్లో ఉన్న కేసులు 50 సంఖ్యకు వచ్చాయి. ఇప్పుడు ఇంకాస్త తగ్గి గురువారం నాటికి కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 41కి చేరుకున్నాయి. దీంతో జిల్లాలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 62,879కి చేరుకుంది. 62 మంది కోవిడ్ నుంచి కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యారు.

కాగా, ఇప్పటిదాకా జిల్లాలో ఈ వ్యాధి బారిన పడి మృతి చెందిన వారి సంఖ్య 570గా నమోదైంది.

వీక్షణం - మంజీర

### అంతా సమానమే

# రాజకీయాలు తప్ప

**96.2** శాతం... ఇది కేరళ రాష్ట్రంలో అక్షరాస్యత శాతం. అక్షరాస్యత సాధనలో మన దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం అది. మగవాళ్ల అక్షరాస్యత 97.4గా ఉంటే మహిళల శాతం 95.2. కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో తొంభై శాతం దాటడం, దేశంలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకోవడం ఇప్పుడు కొత్తగా చెప్పుకోవాల్సిన అంశం ఏమీ కాదు. ఎన్నో దశాబ్దాల కిందటనే ఈ ప్రగతి సాధించింది. చదువులో సాధించిన పురోగతి... కేరళ మహిళలను సమాజంలో ముందంజలో నిలిపింది కూడా. జనాభాలోనూ ఓటరు జాబితాలో మగవాళ్ల కంటే ఆడవాళ్లే ఎక్కువగా ఉన్నారు. అంటే... గర్భస్థ శిశువును లింగ నిర్ధారణ చేసుకుని ఆడపిల్ల అయితే గర్భవిచ్ఛిత్తి చేసుకోవడం వంటి దారుణమైన ఆలోచనలేవీ ఆ సమాజంలో లేవని తెలుస్తోంది. చదువు, ఉద్యోగం, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన వారి జీవన స్థాయిలను ఉన్నత స్థితికి చేర్చింది. ఇవన్నీ చూస్తే... ఆ రాష్ట్రంలో సమసమాజ స్థాపన ఎంతో దూరం లేదనే సదభిప్రాయాన్ని కూడా కలిగిస్తుంది. స్త్రీ పట్ల వివక్ష లేని సమాజాన్ని చూస్తున్న సంతోషమూ కలుగుతుంది. అయితే ఆ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని చూస్తే అక్కడి మహిళాభివృద్ధి అంతా ఒక్క రాజకీయాలకు తప్ప... అనక తప్పదు. ఇందుకు ఉదాహరణలెన్నో...

## ఆదిలోనే హంసపాదు

అది 2011, కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయం. రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలు 140. ఈ స్థానాలకు గాను వచ్చిన నామినేషన్‌లలో పురుషుల నామినేషన్‌లు 888, మహిళల నామినేషన్‌లు 83. ఎన్నికల్లో గెలిచి చట్టసభలో అడుగు పెట్టే సంఖ్యలో భారీ తేడా ఉండడాన్ని తప్పు పట్టకూడదు, కానీ చట్టసభలోకి తొలి అడుగు ఎన్నికల బరిలో దిగడమే. ఆ తొలి అడుగు వేయడంలో వెనుకడుగు వేస్తున్నారు మలయాళీ మహిళలు. పోటీచేసిన 83మందిలో గెలిచి చట్టసభలో అడుగుపెట్టింది ఇరవై మంది మాత్రమే. చట్టసభల పరిస్థితి ఇలా ఉంటే స్థానిక సంస్థల పరిస్థితి మరోలా ఉంది. స్థానిక సంస్థలకు మూడింట ఒకవంతు స్థానాలు మహిళలకు రిజర్వ్ అయి ఉంటాయి. 73,73 రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు అంది వచ్చిన అవకాశం అది. ఈ రిజర్వేషన్ పుణ్యమా అని ఆ స్థానాల్లో మహిళలు మాత్రమే పోటీ చేయాలి, గెలవాలి, స్థానిక పరిపాలనలో భాగస్వామ్యం కావాలి. మహిళా పురోగతి కోసం నిర్ణయాలు చేయాలి. పరిపాలన ఉమెన్ ఫ్రెండ్లీగా ఉండాలంటే మహిళల ఆలోచనలతోనే నిర్ణయాలు, తీర్మానాలు, ఆచరణ కోసం చేసుకున్న ఏర్పాటు ఇది. మరి... క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతోంది?

## నాణేనికి రెండో వైపు

కేరళలో రాబోయే డిసెంబర్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు అంతా సిద్ధం అయింది. నామినేషన్‌లు, ఉపసంహరణలు, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులు జరిగిపోయాయి. 8, 10, 14 తేదీల్లో ఎన్నికలు. అయితే ఎన్నికల ముఖచిత్రం మాత్రం నాణేనికి రెండు వైపులా ఒకదానికొకటి పూర్తిగా భిన్నం. ఈ సారి కొత్త ట్రెండ్ కనిపిస్తోందని జాతీయ స్థాయిలో మీడియా సంతోషం వ్యక్తం చేస్తోంది. హాకీ ప్లేయర్ రేఖ ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆమె రాష్ట్ర మహిళల హాకీ జట్టులో క్రీడాకారిణి. అలాగే శరుతి అనే యువ న్యాయవాది కూడా పోటీలో ఉన్నారు. ఆమె ఒన్ మ్యాన్ ఆర్మీలాగ తన బైక్ మీద కాలనీలన్నీ చుట్టేస్తున్నారు. స్వయంగా ఓటర్లను కలుస్తూ తన ప్రచారాన్ని తానే సింగిల్‌గా చేసుకుంటున్నారు. ఇక జీజా సుధీశ్ అనే మహిళ కంప్యూటర్ డిజైనర్. పగలంతా ప్రచారంలో పాల్గొంటూ, రాత్రి తన బ్యానర్‌లను తానే డిజైన్ చేసుకుంటున్నారు. ఎకో ఫ్రెండ్లీ పోస్టర్లతో ప్రచారం చేస్తున్నారామె. మరో ప్రత్యేకత భార్యాభర్తలు చెరొక వార్డులో పోటీ చేయడం. పాలక్కాడ్‌లో జయన్, కవిత అనే టీచర్లు వేరు వేరు వార్డుల్లో పోటీ చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే... ముస్లిం జనాభా ఎక్కువగా ఉండే మలప్పురంలో బీజేపీ కూడా ఇద్దరు మహిళలను తమ పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలపగలిగింది. సుల్‌ఫాత్, ఆయేషా అనే మహిళలను చూపిస్తూ మా పార్టీకి ముస్లిం వ్యతిరేకత మకిలిని అంటగడుతుంటారు కదా... ఇప్పుడు చెప్పండి అన్నట్లు ప్రచారం చేసుకుంటోంది. ఇదంతా నాణేనికి ఒక వైపు. మరో వైపు అభ్యర్థిని చూపించని ప్రచారం కూడా సాగుతోంది. అభ్యర్థి వాడవాడలకూ వెళ్లి, ఓటర్లను కలిసి అభ్యర్థిస్తే కూడా ఓటర్లు ప్రసన్నం కావడం కష్టం. అలాంటిది అభ్యర్థి కనిపించకపోతే ఓట్లెలా వస్తాయనే ప్రశ్న ఎవరిలోనైనా ఉదయించిందీ అంటే... అది వారి అమాయకత్వమే. స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా భారీ కటౌట్‌లు, బ్యానర్‌లు పెడతారు. ఆ బ్యానర్ మీద అభ్యర్థి అయిన మహిళ పేరు ఉండదు, గుర్తు మాత్రమే ఉంటుంది. ఆమె భర్త ఫొటో ప్రధానంగా సింహభాగాన్ని ఆక్రమించి ఉంటుంది. అతడి ఫొటో కింద 'ఫలానా వ్యక్తి భార్యకు ఓటేయండి. ఆమె గుర్తు ఫలానా' అని మలయాళంలో రాసి ఉంటుంది. ఆడవాళ్ల ఫొటోను, పేరును బహిర్గతం చేయరు. భర్తను చూసి భార్యకు ఓటేయాలంతే. ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా లేదు. అభ్యుదయ కమ్యూనిస్ట్ పార్టీ అయినా సరే... ఈ షరతుకు తలొగ్గి అభ్యర్థిని ఖరారు చేయాల్సిందే. 2015 ఎన్నికల్లో ఈ బ్యానర్‌లో, హోర్డింగుల మీద సోషల్ మీడియాలో పెద్ద దుమారమే చెలరేగింది. అయినప్పటికీ పద్ధతి మారలేదు. పరిస్థితిలో మార్పు రాలేదు.

## ముసుగు తొలగుతుందా?

అభ్యర్థి మహిళ కాబట్టి ఆమె పేరు కూడా బహిర్గతం చేయకూడదనే భావజాలానికి తగిలించుకున్న మగస్వామ్యపు ముసుగు తొలగిపోయేదెప్పుడు? ఆ ముసుగు తనంతట తానుగా తొలగిపోతుందా? మరెవరైనా తొలగించే ప్రయత్నం చేస్తే సహిస్తుందా? మన రాష్ట్రంలో ఓ పాతికేళ్ల కిందట స్వాతంత్ర్యదినోత్సవం తెల్లవారి వార్తా పత్రికల్లో కొన్ని వార్తలు ప్రముఖంగా కనిపించేవి. ఒక గ్రామానికి సర్పంచ్ మహిళ అయితే, ఆ గ్రామంలో జెండా ఎగురవేసేది మాత్రం ఆమె భర్త. ఈ దురాక్రమణ మండల పరిషత్‌లకూ తప్పేది కాదు. మండలాధ్యక్షురాలి భర్త జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఫొటోలు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుండేవి. అప్పట్లో ఉత్తరాది రాష్ట్రాలూ ఇందుకు భిన్నంగా ఏమీ ఉండేవి కాదు. కానీ ఇప్పుడు మార్పు వచ్చింది. అభ్యుదయం పరిఢవిల్లుతున్న కేరళలో ఊహించని మరో పార్శ్వం ఇది.

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# గోవిందుని దర్శనానికి కోవింద్

## స్వాగతం పలికిన నెల్లూరు నేతలు



నవంబర్ 24వ తేదీ ఏడుకొండలవాడి దర్శనార్థం కుటుంబసమేతంగా తిరుపతికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం నెల్లూరు నేతలు, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిలను సీఎం రాష్ట్రపతికి పరిచయం చేశారు. వీరితో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా ఉన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




## ప్రథమ వర్ధంతి



జననం : 24.04.1937 మరణం : 30.11.2019

ఆయన జీవితం ఓ మధురమైన గతమైనా...
ఆయన జ్ఞాపకాలే ఎప్పటికీ మా గుండెచప్పుళ్ళు.

**శ్రీ ఆనం వెంకటకృష్ణారెడ్డి (A.V.K) గారు**

పరమపదించి తేది. 30.11.2020 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ మహనీయుని ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య - **ఆనం లలిత**
మరియు **కుటుంబసభ్యులు**



## శ్రద్ధాంజలి

ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రజలు మరువరు మీ సేవలు

**కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు**
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

**25వ వర్ధంతి సందర్భంగా**
**వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...**

**కుటుంబ సభ్యులు**
మరియు **బంధుమిత్రులు**

తేది: 1-12-2020 మంగళవారం ఉ॥ 10.30 గం॥లకు రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణ మండపంలో
**మహనీయులు కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారికి స్మృత్యంజలి ఘటిస్తారు.**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com